quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక

EDITOR : GILLALA BUCHI REDDY | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 222 | శనివారం, మే 04 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం.

తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే తెలుగు దినపత్రిక

## పాంచ్ న్యాయ్ - పచ్చీస్ గ్యారంటీస్

### గాంధీభవన్‌లో విడుదల చేసిన దీపాదాస్ మున్షీ



**హైదరాబాద్ క్విక్ టుడే :** అసెంబ్లీ ఎన్నికలకు ఆరు గ్యారంటీలతో పాటు బోలెడన్ని హామీలతో మేనిఫెస్టో రిలీజ్ చేసిన కాంగ్రెస్ పార్టీ తాజాగా లోక్ సభ ఎన్నికలకు కూడా ప్రత్యేకంగా ఓ మేనిఫెస్టో రిలీజ్ చేసింది జాతీయ కాంగ్రెస్ పాంచ్ న్యాయ్ - పచ్చీస్ గ్యారంటీస్ పేరుతో ఓ మేనిఫెస్టో విడుదల చేసింది. దీన్ని తుక్కుగూడలో జరిగిన సభలో తెలుగులోనూ విడుదల చేశారు. అయితే తెలంగాణకు ఏమి చేస్తారో ప్రత్యేకంగా మేనిఫెస్టో విడుదల చేయాలనుకున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఏమేమి చేస్తామో వివరిస్తూ.. మేనిపెస్టోను సిద్ధం చేసి.. విడుదల చేశారు. తెలంగాణ ప్రత్యేక మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఐదు న్యాయాలు, తెలంగాణకు ప్రత్యేక హామీల పేరుతో దీన్ని రూపొందించారు. మ్యానిఫెస్టో తెలుగు ప్రతిని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు. అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని మ్యానిఫెస్టో తయారు చేసినట్లు మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో 23 అంశాలు చేర్చినట్లు చెప్పారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే విభజన చట్టం హామీలు అమలు చేస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువత కోసం వివిధ యూనివర్సిటీలు తెస్తామన్నారు. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పారు. సుప్రీం కోర్టు ప్రత్యేక బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. ఏపీలో కలిపిన 5 గ్రామాలను మళ్లీ రాష్ట్రంలో విలీనం చేస్తామన్నారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కల్పిస్తామని తెలిపారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు పెంచుతామని చెప్పారు. పార్టీ నేతలు, కార్యకర్తలు.. ప్రతి గడపకు మ్యానిఫెస్టోను తీసుకెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల క్రమంలో.. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హామీలు ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు మేనిఫెస్టోలో స్పష్టం చేసింది. ఇందులో హైదరాబాద్ -టూ- బెంగళూరు ఐటీ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ముఖ్యమైనది. రాష్ట్ర అవసరాలు ఆలోచించి మరీ మేనిఫెస్టో తయారుచేశామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, మేడారం జాతరకు జాతీయ హోదా కల్పిస్తామని చెప్పారు. ఈ మేనిఫెస్టోను యువత, మహిళలు, రైతులు, కార్మికులకు న్యాయం జరిగేలా రూపొందించి నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అన్నివర్గాలతో మాట్లాడి మేనిఫెస్టో తయారు చేశామని వెల్లడించారు. పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారంటీలో భాగంగా మేనిఫెస్టో తయారు చేసినట్లు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

## కెసిఆర్ ఆదేశాల మేరకే

# పనులు చక్కబెట్టాం



- ఫోన్ ట్యాపింగ్‌లో సంచలన విషయాలు
- పదేపదే పేరును ప్రస్తావించిన రాధాకిషన్ రావు

**హైదరాబాద్ క్విక్ టుడే :** టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్‌రావు వాంగ్మూలంలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. రాధా కిషన్ రావు వాంగ్మూలంలో మాజీ సీఎం కేసీఆర్ పేరును పలుమార్లు ప్రస్తావించినట్టు తెలుస్తోంది. టాస్క్ ఫోర్స్ డీసీపీ నియామకంలో ప్రభాకర్ రావు పాత్ర కీలకమని వెల్లడించినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో తొలిసారి మాజీ సీఎం కేసీఆర్ పేరు వెలుగులోకి వచ్చింది. కేసీఆర్ కుటుంబ సభ్యులు, పార్టీలో సన్నిహితుల వ్యవహారాలను చక్కబెట్టేందుకు తాము పనిచేశామని రాధా కిషన్ రావు వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రణీత్‌రావు వెల్లడించే వివరాల ఆధారంగా రాజకీయ నేతలతో పాటు వారికి ఆర్థికంగా సహాయం చేసే వారిని లొంగదీసుకున్నామని తెలిపారు. సివిల్ తగాదాల్లో సెటిల్మెంట్ చేస్తూ ఎన్నికల సమయంలో వారి నగదును అడ్డుకున్నామని రాధా కిషన్‌రావు తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన నగదు తరలింపులో తాము సహకరించినట్టు టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధా కిషన్ రావు వెల్లడించారు. 2017 లో ఎస్పీగా ప్రమోషన్ వచ్చిన తర్వాత టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించడంలో ప్రభాకర్ రావు పాత్ర కీలకమని తెలిపారు.

ఖఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలు చక్కదిద్దేందుకే తనను ఏరీ కోరి టాస్క్ ఫోర్స్ డీసీపీగా నియమించినట్టు వెల్లడించారు. టాస్క్ ఫోర్స్ డీసీపీగా నియామకం తర్వాత కేసీఆర్ అత్యంత సన్నిహితుల కార్యకలాపాలను చెక్కబెట్టేవాడినని రాధా కిషన్ రావు తెలిపారు. అధికార పార్టీ నగదు రవాణాకు ప్రణీత్ రావుతో సమన్వయం చేసుకోవాలని ప్రభాకర్ రావు ఆదేశాలు ఇచ్చేవాడని వెల్లడించారు. కేసీఆర్‌కు లబ్ది చేకూరేలా ప్రభాకర్ రావు ప్రత్యేక పనులు తనకు అప్పగించే వాడన్నారు. అడిషనల్ ఎస్పీ భుజంగరావు ప్రతి విషయాన్ని ప్రగతిభవన్‌లో కేసీఆర్‌కు స్వయంగా వెళ్లి సమాచారం ఇచ్చేవాడని రాధా కిషన్ రావు వెల్లడించినట్టు తెలుస్తోంది.

## వీడియో కాన్ఫరెన్స్ వద్దు

### నేరుగా విచారణకు హాజరవుతా : కవిత



**న్యూఢిల్లీ క్విక్ టుడే :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీ మే 7వ తేదీతో ముగియనుంది. దీంతో ఆమెను అధికారులు కోర్టు ముందు హాజరుపరచనున్నారు. అయితే, తనను కోర్టుకు నేరుగా హాజరుపరచాలని.. వీడియో కాన్ఫరెన్స్ వద్దని కోర్టును కవిత కోరారు. ఈ మేరకు కోర్టుకు దరఖాస్తు చేసు కున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత విచారణ ఖైదీగా తీహార్ జైల్లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే, గతంలో కస్టడీ ముగిసినప్పుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను అధికారులు కోర్టు ధర్మాసనం ఎదుట హాజరుపరిచారు . ఇప్పుడు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరిచే అవకాశం ఉంది. దీంతో.. ఈ విచారణకు నేరుగా హాజరుపరచాలని కోరుతూ కోర్టు అప్లికేషన్ పెట్టుకున్నారు.

## విభజన హామీలు

# తుంగలో తొక్కారు

- బిజెపి ఎజెండాలో రాజ్యాంగం రద్దు..రిజర్వేషన్ల రద్దు
- కులగణన చేపట్టకుండా చేయడంలో ఆంతర్యమిదే
- రిజర్వేసన్లు ఉండాలంటే కాంగ్రెస్ గెలవాలి
- ధర్మపురి సభలో సిఎం రేవంత్ రెడ్డి పిలుపు



**ధర్మపురి క్విక్ టుడే :** పదేళ్లుగా మోడీ తెలంగాణకు చేసిందేమీ లేదని..రేపు మరేదో చేస్తారన్న ఆశా లేదని ప్రధాని మోదీపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లను రద్దచేయడమే లక్ష్యంగా బిజెపి పనిచేస్తోందని అన్నారు. అందుకే కులగణన, జనాభా లెక్కల సేకరణ గత పదేళ్లుగా చేపట్టలేదని రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపి ఎజెండా మేరకు ముందుకు సాగుతోందని సిఎం విమర్శలు చేశారు. ధర్మపురిలో జరిగిన జనజాతర సభలో సిఎం మాట్లాడారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ధర్మపురిలో నిర్వహించిన జనజాతర సభలో సీఎం ప్రసంగించారు. మోదీ వాట్సప్ యూనివర్సిటీని నడుపుతున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి మంత్రిగా ఉండి తెలంగాణకు ఏం తెచ్చారని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు, వరంగల్ రైల్వే కోచ్ ఏం చేశారని నిలదీశారు. అబద్దాల పోటి పెడితే బీజేపీ నేతలతో ఎవ్వరూ పోటీ పడలేరని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలు అబద్దాలు చెప్పడంలో పీహెడీ చేశారని ఆరోపించారు. తెలంగాణకు ఏం చేయని బీజేపీ లక్షల కోట్ల నిధులు గుజరాత్ కు తీసుకెళ్లారని ఆరోపించారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి రావాలని 400 సీట్లు కావాలని అడుగుతున్నారని చెప్పారు. ఆ 400 సీట్లు రాజ్యాంగాన్ని మార్చడం కోసమే అడుగుతున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తుందని అందుకే 8 రాష్ట్రాల ప్రభుత్వాలను పడగొట్టారని తెలిపారు. 2021లో ఎందుకు జనాభా లెక్కలు చేయలేదని ప్రశ్నించారు. రిజర్వేషన్లు రద్దు చేసే అధికారం మీకు ఎవరిచ్చారని నిలదీశారు. గాంధీ కుటుంబానికి పదవులపై వ్యామోహం లేదని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే కానీ రిజర్వేషన్లు ఉండవని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచడమే కాకుండా బలహీనవర్గాల కులగణన కాంగ్రెస్ చేస్తుందని చెప్పారు. రిజర్వేషన్లే ప్రధాన అంశంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నేతకాని కార్పొరేషన్, సింగరేణి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పోటీ చేసే అభ్యర్థి లేక .. ధర్మపురి ప్రజలు తిరస్కరించిన కొప్పుల ఈశ్వర్‌నే మళ్లీ ఎంపీ అభ్యర్థిగా భారాస నిలబెట్టిందని ఆక్షేపించారు.భాజపా నేతలు నోరు తెరిస్తే అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు.

## రాయబరేలి, అమేఠీలలో కాంగ్రెస్ నామినేషన్లు



**లక్నో :** రాయబరేలి, అమేఠీ అభ్యర్థులను ప్రకటించడం ఆలస్యం..ఆ ఇద్దరు అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు వేశారు. రాయబరేలిలో రాహుల్ నామినేసన్ వేయగా అగ్రనేతలు తరలివచ్చారు. తల్లి సోనియా వెంటరాగా రాహుల్ నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని రాయ్ బరేలీ నుంచి ఎంపీగా ఎంపిక చేయగా నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాహుల్ వెంట సోనియా గాంధీ, సోదరి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాబర్ట్ వాద్రా ఉన్నారు. సోనియా గాంధీ రాజ్యసభకు ఎంపిక కావడంతో రాయ్ బరేలీ నుంచి ఈ సారి రాహుల్ పోటీ చేస్తున్నారు. రాయ్‌బరేలీ నుంచి దినేష్ ప్రతాప్ సింగ్‌ను బీజేపీ పోటీకి దింపింది. అయితే ఇక్కడ ప్రియాంక పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ ఆమె ఎందుకనో దూరంగా ఉన్నారు. మరోవైపు అమెథీ నుంచి కిశోరీ లాల్ శర్మ నామినేషన్ వేశారు. ఈ రెండు స్థానాలకు మే 20న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లకు శుక్రవారం చివరితేదీ కావడంతో రాహుల్ నామినేషన్ వేశారు. వయోనాడ్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న రాహుల్ మరోసారి అక్కడి నుంచే పోటీచేశారు. ఏప్రిల్ 26న అక్కడ పోలింగ్ పూర్తయ్యింది. ఇకపోతే చాలకాలం తరవాత గాంధీయేతరులకు అమేథీలో టిక్కెట్ ఇచ్చారు.

## రాహుల్ నామినషన్‌కు హాజరైన రేవంత్



**లక్నో క్విక్ టుడే :** సిఎం రేవంత్‌రెడ్డి రాయ్‌బరేలీకి వెళ్లారు. శుక్రవారం రాహుల్ గాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అందులో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి ముఖ్యమంత్రి రాయ్‌బరేలీకి వెళ్లారు. సోనియాగాంధీ ఇటీవల రాజ్యసభ ఎంపిగా ఎంపికవ్వగా ఆమె పోటీ చేసే స్థానం రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీ బరిలో నిలుస్తున్నారు. అమేథీ నుంచి కిషోర్‌లాల్ శర్మను కాంగ్రెస్ బరిలో నిలిపింది.

## ఫోన్‌ట్యాపింగ్ పేరుతో అసత్యప్రచారాలు

- లోక్‌సభ ఎన్నికల ముందు బద్నాం చేసే యత్నాలు
- అడ్డుకోవాలంటూ హైకోర్టులో బిఆర్ఎస్ పిటిషన్

**హైదరాబాద్ క్విక్ టుడే :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ సీఎం కేసీఆర్ కోసమే ఫోన్ ట్యాపింగ్ చేశామంటూ మాజీ పోలీసు అధికారి రాధాకిషన్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం నేపథ్యంలో శుక్రవారం ఆసక్తికర పరిణామం జరిగింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికే ఎలక్షన్ కమిషన్‌కు ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది.

# బిఆర్ఎస్‌కు మరో ఎదురుదెబ్బ

## ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక రద్దు
## ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు
## 50వేల జరిమానా కూడా విధింపు



**హైదరాబాద్,మే3:** భారత రాష్ట్ర సమితికి వరుసగా కష్టాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఎమ్మెల్సీ దండె విఠల్ పై అనర్హతా వేటు పడింది. భారాస ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నికపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించింది. కాంగ్రెస్ నేత పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపి విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆయనకు రూ.50 వేల జరిమానా విధించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి భారాస ఎమ్మెల్సీగా 2022లో దండె విఠల్ ఎన్నికయ్యారు. అయితే, తాను నామినేషన్ ఉపసంహరించు కోలేదని, తన సంతకాలు ఫోర్జరీ చేశారని పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. విఠల్ ఎన్నిక చెల్లదంటూ ప్రకటించాలని కోర్టును కోరారు. ఫోర్జరీని తేల్చేందుకు పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరికీ పంపించాలని కోరారు. అనంతరం దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి దండె విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక చెల్లదని కాంగ్రెస్ నేత పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు దండె విఠల్ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థిగా కేసీఆర్ దండె విఠల్ ను ఖరారు చేశారు. ఈ పేరుతో విబేధించిన అప్పటి బీఆర్ఎస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఇండిపెండెంట్ గా నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామనేషన్ల ఉపసంహరణ సమయంలో ఆయన పేరుతో ఉపసంహరణ దరఖాస్తు వచ్చిందని చెప్పి.. ఆయన నామినేషన్ పత్రాలను ఉపసంహరించేశారు రిటర్నింగ్ అధికారి. కానీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని తన సంతకం ఫోర్జరీ చేసి.. ఉపసంహరించినట్లుగా ప్రకటించారని కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం .. నామినేషన్ ఉపసంహరణ పత్రాలపై సంతకం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిది కాదని తేల్చి.. ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో దండె విఠల్ ఏకపక్ష విజయం సాధించారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసి 667 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఓట్లలో దండే విఠల్ 742 ఓట్లశాతం తెచ్చుకున్నారు. ఆదిలాబాద్ లో మొత్తం ఓట్లు 860. అందులో చెల్లిన ఓట్లు 810, చెల్లని ఓట్లు 45 ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థి పెందూరి పుష్పరాణి 75 ఓట్లకే పరిమితమయ్యారు. పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ ఉపసంహరణతో అసలు వివాదం ప్రారంభమయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేయడంతో వారి స్థానంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఇప్పటికే పూర్తయింది. కోడ్ కారణగా కౌంటింగ్ వాయిదా పడింది. వరంగల్, నల్లగొండష ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి నోటిఫికేషన్ వచ్చింది. రెండో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు.

## చంద్రబాబు మేనిఫెస్టోలో
# కానరని పెన్షన్

**బాబు మేనిఫెస్టోలతో మేజిక్ చేస్తాడు**
**వాటిని నమ్ముకుంటే అధోగతే**
**చంద్రబాబును నమ్మితే చంద్రముఖిని లేపినట్లే**
**ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో సిఎం జగన్ ప్రచారం**



**ఒంగోలు/గుంటూరు,మే3:** ఏపీలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. అధికార ప్రతిపక్ష పార్టీలు మేనిఫెస్టో కూడా ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం చర్చంతా మేనిఫెస్టోలోని హామీల మీదనే జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న పథకాలకే నగదు పెంచి వైసీపీ మేనిఫెస్టో రూపొందించగా, సూపర్6 అంటూ జనాకర్షక పథకాలతో మేనిఫెస్టో రూపొందించారు చంద్రబాబు. ఈ క్రమంలో సీఎం జగన్ కూటమి మేనిఫెస్టో మీద ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు పెన్షన్ హామీని మేనిఫెస్టో నుండి అప్పుడే ఎత్తేశారని, చంద్రబాబు మేనిఫెస్టో మాయలను నమ్మొద్దని అన్నారు. సూపర్6 పేరుతో మొదట మినీ మేనిఫెస్టో ప్రకటించిన చంద్రబాబు, ఆ తర్వాత కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పెన్షన్ హామీని 5వ పేజీకి షిఫ్ట్ చేశాడు. కాగా, నిన్న ఇచ్చిన ఒక పత్రికా ప్రకటనలో సూపర్6 హామీల్లో పెన్షన్ హామీ లేకపోవడాన్ని ఉద్దేశిస్తూ జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు మేనిఫెస్టో మాయలను నమ్మొద్దని, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని అన్నారు. ఒక్క నెల ఓపిక పడితే, మళ్ళీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని, పెన్షన్ మళ్ళీ ఇంటికే వస్తుందని జగన్ అన్నారు. చంద్రబాబును నమ్మడమంటే చంద్రముఖిని నిద్రలేపినట్లేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పల్నాడు జిల్లా పెదకూరపాడు క్రోసూరు సెంటర్‌లో బహిరంగ సభలో మాట్లాడుతూ చంద్రబాబు మూడు సార్లు సీఎంగా పనిచేశారని చెప్పుకుంటారు.. చంద్రబాబు పేరు చెబితే ఒక్క మంచైనా గుర్తొస్తుందా? అంటూ ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ చూడని పాలనను 59 నెలల్లో చూశారు. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్ని కొనసాగింపు. అదే చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికి ముగింపే. విశ్వసనీయతకు మరోసారి ఓటేసేందుకు మీరంతా సిద్ధమా?. గతంలో లేని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చా. రూ.2 లక్షల 70 వేల కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. 31 లక్షల ఇళ్ల పట్టాలు అక్కా చె÷-లలెమ్మల పేరుపై రిజిస్ట్రేషన్ చేశాం. ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చా. మీ ఓటు ఐదేళ్ల భవిష్యత్తు అని సీఎం జగన్ పేర్కొన్నారు. 2014లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా?. పిల్లల చేతుల్లో ట్యాబులు ఎప్పుడైనా మీరు చూశారా?. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి, దీవెన, ఆసరా, చేయూత, కాపునేస్తం లాంటి పథకాలు చూశారా?. గతంలో మేనిఫెస్టో పేరుతో ఎలా మోసం చేశారో అందరూ చూశారు 2014లో మేనిఫెస్టోను నమ్మి కూటమికి ఓటు వేశారు?. ఒక్కరికైనా రైతు రుణమాఫీ చేశారా?. అర్హులైనవారికి పక్కా ఇళ్లు అన్నారు.. ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చారా?. సింగపూర్ మించి అభివృద్ధి చేస్తానని అన్నారు.. జరిగిందా?. ఆడబిడ్డ పుడితే రూ.25 వేలు డిపాజిట్ చేస్తానన్నాడు.. చేశాడా?. ఇంటికో ఉద్యోగం అన్నాడు.. ఇచ్చాడా?‘ అంటూ చంద్రబాబును సీఎం జగన్ నిలదీశారు. జరగబోయే ఈ ఎన్నికలు మీరు వేసే ఓటు మీ ఇంటింటి భవిష్యత్తును, పథకాల కొనసాగింపును నిర్ణయిస్తుంది. సాధ్యం కాని హామీలతో బాబు ఇచ్చిన మేనిఫెస్టోకు అర్థం ప్రజలను మోసం చేయడమే. చంద్రముఖి నిద్ర లేస్తే గతంలోలాగే మీ రక్తం తాగేందుకు ఇంటింటికీ వస్తుంది. బాబు మోసాలను ఓడించడానికి, పేదలను గెలపించడానికి, విలువలు, విశ్వసనీయతకు ఓటు వేయడానికి మీరంతా సిద్ధమేనా?. మీరు జగన్‌ను నమ్మి అధికారం ఇచ్చినందువల్ల గత ఐదేళ్లలో ప్రతి ఒక్క రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తేగలిగాం‘ అని సీఎం జగన్ పేర్కొన్నారు. 2,31,000 ప్రభుత్వ ఉద్యోగాలు 59 నెలల కాలంలోనే ఇచ్చాం. అక్కచెల్లెమ్మలకు 31 లక్షల ఇళ్ల పట్టాలు, 21 లక్షల ఇళ్ల నిర్మాణం ఈ 59 నెలల్లోనే జరుగుతోంది. మేనిఫెస్టోకు విశ్వసనీయత తెచ్చి 99? అమలు జరిగింది ఈ పాలనలోనే. ప్రభుత్వ బడులు మారాయి, పిల్లల చదువులు మారాయి. లంచాలు లేని వివక్షలేని ఇంటివద్దకే పాలన, పెన్షన్, పౌరసేవలు, పథకాలు గతంలో ఎప్పుడూ లేవు‘ అని సీఎం జగన్ వివరించారు. ఒక్క నెల ఓపిక పట్టండి.. మీ బిడ్డ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం పెడతా.. వాలంటీర్లు మళ్లీ మీ ఇంటికే వచ్చి పెన్షన్ ఇస్తారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి బహిరంగ సభలో మాట్లాడుతూ, ఈ ఎన్నికలు.. ఐదేళ్ల భవిష్యత్.. జగన్‌కు ఓటేస్తే.. పథకాలు కొనసాగింపు పొరపాటున బాబుకు ఓటేస్తే.. పథకాలకు ముగింపేనన్నారు. రూ.వెయ్యి పెన్షన్‌ను రూ.3వేలు చేసింది మీ బిడ్డ జగన్. 39 లక్షల మందికి మాత్రమే బాబు పెన్షన్ ఇచ్చాడు.. మీ బిడ్డ జగన్.. 66 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నాడు. లంచాలు, వివక్ష లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ ఇస్తున్నాం. చంద్రబాబు పాపిష్టి కళ్లు అవ్వాతాతలపై పడ్డాయి. నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించి పెన్షన్ అడ్డుకున్నాడు. బాబు హయాంలో పెన్షన్ల కోసం జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సివచ్చేది. చంద్రబాబు చేసిన పనివల్లే అవ్వాతాతలు ఎండలో బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన పని లేదు.. ఎవరి చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా పెన్షన్లు ఇచ్చాం. అవ్వాతాతలకు ఇంటికే రూ.3000 పెన్షన్ పంపించాం అని సీఎం జగన్ పేర్కొన్నారు. పెన్షన్ల విషయంలో అవ్వాతాతలకు అన్యాయం జరిగింది. ఆ నెపాన్ని కూడా దుర్మార్గ చంద్రబాబు మనపై నెడుతున్నాడు.

PLOTS FOR SALE
JANAGAON TOWN
SRI SAI RAM VENTURE
జనగామ జిల్లా కేంద్రం.. నర్మెట్ట రోడ్
చదరపు గజం రూ.4500 -6500
99592 02369

PVR CONSTRUCTIONS
HOUSE FOR SALE
INDEPENDENT HOUSE
EAST - 167 SQ. YADS & WEST - 156 SQ. YADS
NEAR JODIMETLA X ROAD,
WARANGAL HIGHWAY, HYDERABAD
9885119830
7013672656
8106654775

PLOTS FOR SALE
JANAGAON TOWN
HANUMAKONDA ROAD
78930 45646
96769 74480

జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు

ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్ధంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము
అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను పకడ్బందీగా నిర్వహించాలి

### మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌతమ్





**మేడ్చల్ కలెక్టరేట్, క్విక్ టుడే న్యూస్ :** పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌతమ్ ప్రిసైడింగ్,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోజున కీసర మండలంలోని బోగారం లోని హెూలీ మేరీ కాలేజీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్,ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ను పరిశీలించారు. మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మేడ్చల్ అసెంబ్లీ సెగ్మెంట్ లో పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటరు రిజిస్ట్రేషన్ రిజిస్టర్ లను, ఓటింగ్ సరళిని ఆయన పరిశీలించారు. మే 8వ తేదీ వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ను ఉద్యోగులందరూ వినియోగించుకొనుటకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ సజావుగా, సాఫీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మార్వో రజిని, హసీనా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న నామినేషన్ కు హాజరైన తుంగతుర్తి రవి



**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :** పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న నామినేషన్ ర్యాలీ కార్యక్రమానికి హాజరైన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మరియు పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులు, మహిళా నాయకులు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న విజయం నిశ్చయం అని, వారిని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. పట్టభద్రులు అందరూ రేవంత్ అన్న పాలనలో జరిగే అభివృద్ధి పనులు , నియామకాలను చూసి కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేసి గెలిపించాలి అని అన్నారు.

# కేసీఆర్ అంటే నమ్మకం, బీఆర్ఎస్ అంటే అభివృద్ధి

### పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గడప గడపకు బీఆర్ఎస్ కార్యక్రమం





**పీర్జాదిగూడ, క్విక్ టుడే న్యూస్ :** మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీ.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థి శ్రీ రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా 14వ డివిజన్ అధ్యక్షులు జావీద్ ఖాన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్, వివేకానంద నగర్, వినాయక నగర్లో నిర్వహించిన గడప గడపకు ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాల తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత 420 హామీలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అక్కల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బిజెపిల పార్టీలను ఓడించండి


### - సిపిఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను గెలిపించండి.
### - బొడెంకి చందు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు



**చెన్నూర్, మే 03. క్విక్ టుడే న్యూస్ :** చెన్నూరు మండలం రాజన్న కాలనీలో బిజెపి బందిఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దాం అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోడెంకి చందు మాట్లాడుతూ మే 13 ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించబోయే ఎన్నికలు గత పది సంవత్సరాల బిజెపి పాలనలో మాటలు మూటలు తప్ప చేతులు చటాక్ అంతా కూడా లేవని అన్నారు. బిజెపి ప్రభుత్వం చెప్పిన జన్ ధన్ యోజన,అవాజ్ యోజన,సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలని చెప్పిన హామీలను అమలు చేయకపోగా మతాల పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నంచేస్తు బిజెపి ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నది. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను గెలిపించి,బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడం సమ్మక్క, రాతిపల్లి నగేష్, ఉమా రాణి, బండారు రాజేశ్వరి, తుమ్మ రేణుక, బొందన్న, అనసూర్య, స్వరూప, సుజాత, లక్ష్మి, శ్యామల, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు.. వందేళ్ల రికార్డు బ్రేక్

### ఆసియా మొత్తం భగభగలాడుతోంది




**పినపాక ఏప్రిల్ 3. క్విక్ టు డే న్యూస్ :** దేశవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులతో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. పలు ప్రాంతాల్లో భానుడు చంద్ర నిప్పులు కురిపిస్తూ రికార్డులు తిరగరాస్తున్నాడు. 1921 తర్వాత అంటే 103 ఏళ్ల తర్వాత ఏప్రిల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. ఈ మధ్యకాలంలో ఎన్నడూ ఏప్రిల్ నెలలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. ఈ ఏడాది మాత్రం ఏప్రిల్ తొలి వారం నుంచే ఉగ్రరూపం ప్రదర్శిస్తున్న సూరీడు. రోజురోజుకు మరింతగా మండిపోతున్నాడు. ఫలితంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత సర్వసాధారంగా మారిపోయింది. అంతేకాదు, వచ్చే ఐదు రోజుల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. తూర్పు, దక్షిణ భారతదేశంలో అధిక తీవ్రతతో వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. మే నెలలోనూ భానుడి ప్రతాపం కొనసాగుతుందని తెలిపింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల పంట నష్టం, వ్యాధులు వ్యాప్తి చెందడం, భూగర్భ జలాలు క్షీణించడం జరుగుతుంది. గ్లోబల్ వార్మింగ్ అనేది మన పిల్లల తరానికి మనం అందించబోతున్న గొప్ప ప్రతిఫలం. ?ఆసియా మొత్తం భగభగలాడుతోంది.

# నత్త నడకన బిజెపి అభ్యర్థి ప్రచారం..!

### పది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికలు, ఉలుకు పలుకు లేని నాయకులు

**పినపాక మే 3 క్విక్ టు డే న్యూస్ :** మరో పది రోజుల్లో దేశమంతా పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పలు పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకుల తో సంప్రదింపులు జరుపుతూ ప్రచారాల కోసం ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నువ్వా నే నా అనే అనే చందంగా తీవ్ర ఎండ వేడిమిలో సైతం ఒకరినొకరు ప్రశ్నించుకుంటూ ప్రజల మధ్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. పినపాక నియోజకవర్గానికి వచ్చేసరికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గుండెకాయ లాంటి పినపాక నియోజకవర్గం లో జరిగిన శాసనసభ ఎన్నికలలో బిజెపి పార్టీలో ఉన్నంతవరకు కార్యకర్త స్థాయి నుంచి జిల్లా నాయకుల వరకు ప్రచారాలు నిర్వహించారు. అయితే అనుకున్న స్థాయిలో ఓట్లు పడకపోయినా పార్టీ కోసం వారు నమ్ముకున్న నాయకుడు కోసం ఇంటింటికి ప్రచారంలో పాల్గొని పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రయత్నం చేశారు, కానీ పార్లమెంటు ఎలక్షన్స్ కు వచ్చేసరికి చతికిలబడ్డ వారిలా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి నాయకుల వరకు ఎవరికి వారే యమునా తీరే లాగా ఉండడం విస్మయానికి గురిచేస్తుంది. పార్టీలో జరిగే




పై నాయకుల ప్రవర్తన నియమావళి పార్టీకి ఉపయోగపడకపోగా తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నదని ఆ పార్టీలోని నాయకులే బాహాటంగా చర్చించుకుంటున్నారని సమాచారం. ఎన్నికలు వచ్చినప్పుడే పినపాక నియోజకవర్గం బిజెపి పార్టీలో అంగు ఆర్భాటాలు కనబడతాయి,ఆ తర్వాత ఏక్కడేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉంటుందని పలువురు అనుకుంటున్నారు. కేంద్రంలో అధికారం చేపట్టిన భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ నాయకత్వంలో పనిచేస్తున్న కార్యకర్తలు నాయకులు తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్న వివిధ పథకాలలో కేంద్ర ప్రభుత్వం ద్వారా బడ్జెట్ ఎంత చెందుతోంది, ఏఏ పథకాలలో కేంద్రం బడ్జెట్ని వాడుకుంటున్నారు అనే కనీస విధివిధానాలను ప్రజలకు తెలియజేయడంలో నాయకులు పూర్తిగా విఫలం చెందారని సమాచారం. పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్న ఈ పది రోజుల్లో నాయకత్వ లోపం ఇలాగే కొనసాగితే ఉన్న ఆ కాస్త ఓటు బ్యాంకు ఇతర పార్టీలకు చేజిక్కించుకునే అవకాశం పోలేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బిజెపి అధిష్టానం మేల్కొని ఆకాస్త ఓటు బ్యాంకు తరలిపోకుండా జాగ్రత్త పడితే మంచిదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం.

# అధికార పార్టీలో ముసలం

### - చెన్నూరు అధికార పార్టీలో చిచ్చు రేపుతున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్
### - ఎమ్మెల్యే అండదండలతో ఓ వర్గ నేతలను పక్కనెడుతున్న వైనం
### - అసంతృప్తితో పార్టీ మారేందుకు సైతం పలువురి రహస్య మంథనాలు
### - ఎన్నికల వేళ ప్రతిపక్షాలకు వరంగా మారుతున్న ఆ నేత తీరు



**చెన్నూర్,మే 02. క్విక్ టుడే న్యూస్:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ చెన్నూరు ఎమ్మెల్యేకి ముఖ్య అనుచరుడైన మాజీ జడ్పీ వైస్ చైర్మన్ అధికార పార్టీలో చిచ్చు రేపుతుండగా, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు వరంగా మారితుంది. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే తీవ్రంగా శ్రమిస్తుంటే చెన్నూరు పట్టణానికి చెందిన మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తీరుతో పలువురు అధికార పార్టీ నేతలు పార్టీని వీడి బీజేపీలో చేరుతుండగా, మరో పార్టీని వీడి అధికార పార్టీలో చేరేందుకు సైతం వెనకడుగు వేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్యే అండదండలతో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ అక్రమ రేషన్ బియ్యం దందాకు కొమ్ము కాసే ప్రయత్నం చేసి, ఎమ్మెల్యేకి తలవంపులు తీసుకురావడమే కాక చెన్నూరు పరిసర ప్రాంతాల్లో పేకాట స్టావరాలను నిర్వహిస్తూ పార్టీకి మరింత చెడ్డ పేరు తీసుకువస్తూ, ఎన్నికల వేళ అధికార పార్టీకి ప్రజాదరణ లేకుండా చేయడంతో పాటు ఓ వర్గానికి చెందిన నేతలు, కార్యకర్తల పట్ల స్థాయికి మించి వ్యవహరిస్తుండగా, స్థానికంగా అధికారంలో ఉన్నప్పటికీ చెన్నూరు, భీమారం, జైపూర్ మండలాల నేతలు పార్టీని సైతం వీడి బీజేపీలో చేరుతుండగా, పలువురు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించేందుకు రహస్య మంథనాలు సైతం చేస్తున్నట్లు స్థానికంగా చర్చనీయం అయింది. పార్టీ కష్ట కాలంలో ఉన్న సమయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వర్గానికి చెందిన నేతలు జెండా మోస్తూ, మండల స్థాయి పదవుల్లో కొనసాగుతున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా నిన్న కాక మొన్న వచ్చిన మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కు అధిక ప్రాధాన్యత ఇస్తుండగా ఆయన ప్రోటో కాల్ వంటివి పాటించకుండా పలు పార్టీ కార్యక్రమాలకు వారిని దూరం పెడుతూ, వారి పట్ల కింది స్థాయి కార్యకర్తల వలే ప్రవర్తిస్తూ మరో ఎమ్మెల్యేలా వ్యవహరిస్తున్నట్లు పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కోటపల్లి మండలంలోని రాజారం గ్రామస్తులు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తీరుతో విసుగు చెంది ఎన్నికలు బహిష్కరిస్తామంటూ ప్రకటించారు, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కలుగజేసుకొని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తీరు మార్చుకునేలా చేయాలని, లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు కష్టంగా మారుతుందని అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు కోరుతున్నారు.

# కెసిఆర్ కాంగ్రెస్‌లో చేరడం ఖాయం

## - కాంగ్రెస్ పార్టీనే రిజర్వేషన్లకు వ్యతిరేకం
## - సిఎం రేవంత్ దిగజారి మాట్లాడుతున్నారు - బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు

**హైదరాబాద్,మే3:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమంటూ బాంబ్ పేల్చారు. హైదరాబాద్‌ను యూటీ చేయాలని కేటీఆర్ కలలు కంటున్నారంటూ విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీనే రిజర్వేషన్లకు వ్యతిరేకమని అన్నారు. వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని అంబేద్కర్ చెప్తే.. ముస్లిం రిజర్వేషన్లను తెరపైకి తెచ్చారన్నారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడితే కాంగ్రెస్ అంబేద్కర్‌ను అవమానించిందని విమర్శించారు. కులాల పేరు మీద రిజర్వేషన్లు వద్దనేది రాజీవ్ గాంధీ వాదనన్నారు. రేవంత్ రెడ్డి ది కాంగ్రెస్ బ్లడ్ కాదని.. రేవంత్ కాంగ్రెస్ నేతలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ముస్లింలకు రిజర్వేషన్‌లను హైకోర్టు కొట్టివేస్తే.. సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. కేసీఆర్ గతంలో ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పారని గుర్తుచేశారు. కేసీఆర్‌కు ఎలాంటి గతి పట్టిందో అదే గతి రేవంత్ రెడ్డికి పడుతుందని వ్యాఖ్యలు చేశారు. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ఓర్వలేకపోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ గాడిద గుడ్డు కాదు... పాము గుడ్డు గుర్తు కాంగ్రెస్‌కు ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేయించాలంటూ సెటైర్ విసిరారు. ప్రధాని మోదీ గురించి మాట్లాడేందుకు కేటీఆర్‌కు సిగ్గు ఉండాలన్నారు.

ఎన్నికల్లో గెలవమన్న భయంతోనే సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ పోటీ చేయడం లేదని ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు.లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అబద్దాలతో అడ్డదారులు తొక్కుతోందని లక్ష్మణ్ విమర్శించారు. లాగైనా గెలవాలని.. హస్తం నేతలు వర్గాల మధ్య ఘర్షణలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి దిగజారుడు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రిజర్వేషన్లపై కావాలనే ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అనేకసార్లు అవమానించిందన్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక అంబేద్కర్‌కు గౌరవం పెంచిందన్నారు.

దళితులు, ఆదివాసీలకు అధికారం అందించిన ఘనత తమ పార్టీకే దక్కిందని చెప్పారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్ కేసును నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ యూటీ కావాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరుకుంటున్నారని లక్ష్మణ్ విమర్శించారు.

# బిఆర్ఎస్‌కు మరో ఎదురుదెబ్బ

## - ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక రద్దు - ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు తీర్పు - 50వేల జరిమానా కూడా విధింపు

**హైదరాబాద్,మే3:** భారత రాష్ట్ర సమితికి వరుసగా కష్టాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఎమ్మెల్సీ దండె విఠల్ పై అనర్హతా వేటు పడింది. భారాస ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నికపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించింది. కాంగ్రెస్ నేత పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపి విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆయనకు రూ.50 వేల జరిమానా విధించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి భారాస ఎమ్మెల్సీగా 2022లో దండె విఠల్ ఎన్నికయ్యారు. అయితే, తాను నామినేషన్ ఉపసంహరించు కోలేదని, తన సంతకాలు ఫోర్జరీ చేశారని పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. విఠల్ ఎన్నిక చెల్లదంటూ ప్రకటించాలని కోర్టును కోరారు. ఫోర్జరీని తేల్చేందుకు పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ లేబొరేటరికీ పంపించాలని కోరారు. అనంతరం దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. విఠల్ ఎన్నికను రద్దు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించింది.ఆదిలాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి దండె విఠల్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక చెల్లదని కాంగ్రెస్ నేత పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు దండె విఠల్ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021లో ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక



జరిగింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారిక అభ్యర్థిగా కేసీఆర్ దండె విఠల్ ను ఖరారు చేశారు. ఈ పేరుతో విభేదించిన అప్పటి బీఆర్ఎస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఇండిపెండెంట్ గా నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామనేషన్ల ఉపసంహరణ సమయంలో ఆయన పేరుతో ఉపసంహరణ దరఖాస్తు వచ్చిందని చెప్పి.. ఆయన నామినేషన్ పత్రాలను ఉపసంహరించేశారు రిటర్నింగ్ అధికారి. కానీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తాను నామినేషన్ ఉపసంహరించుకోలేదని తన సంతకం ఫోర్జరీ చేసి.. ఉపసంహరించినట్లుగా ప్రకటించారని కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం .. నామినేషన్ ఉపసంహరణ పత్రాలపై సంతకం పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డిది కాదని తేల్చి.. ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చింది. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో దండె విఠల్ ఏకపక్ష విజయం సాధించారు. ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసి 667 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.మొత్తం ఓట్లలో దండే విఠల్ 742 ఓట్లశాతం తెచ్చుకున్నారు. ఆదిలాబాద్ లో మొత్తం ఓట్లు 860. అందులో చెల్లిన ఓట్లు 810, చెల్లని ఓట్లు 45 ఉన్నాయి. స్వతంత్ర అభ్యర్థి పెందూరి పుష్పరాణి 75 ఓట్లకే పరిమితమయ్యారు. పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి నామినేషన్ ఉపసంహరణతో అసలు వివాదం ప్రారంభమయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు రాజీనామాలు చేయడంతో వారి స్థానంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఇప్పటికే పూర్తయింది. కోడ్ కారణగా కౌంటింగ్ వాయిదా పడింది. వరంగల్, నల్లగొండష ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి నోటిఫికేషన్ వచ్చింది. రెండో తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. కాంగ్రెస్ తరపున తీన్మార్ మల్లన్న పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు.

# పిఠాపురంలో వేడెక్కిన రాజకీయం

## - ముద్రగడ వ్యాఖ్యలపై కూతురు అభ్యంతరం - పేరు మార్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్న వర్మ

**కాకినాడ,మే3:** సవాళ్లు ప్రతి సవాళ్లతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు హీటెక్కాయి. పిఠాపురం నియోజకవర్గంలో నేతల మధ్య డైలాగ్ వార్ తీవ్రస్థాయికి చేరింది. వైసీపీ అభ్యర్థి వంగా గీతకు.. కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. వైసీపీలో చేరిన తర్వాత నోటికొచ్చి మాట్లాడుతూ.. ఆఖరికి జనసేన అధినేత, పిఠాపురం అభ్యర్థి పవన్ కల్యాణ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడంతో.. ఆయన కూతురు క్రాంతి రంగంలోకి దిగారు. అలా మాట్లాడటం సరికాదని సూచించారు. ఆ వెంటనే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ లైన్‌లోకి వచ్చారు. ముద్రగడ పద్మనాభంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పిఠాపురం నుంచి పవన్ కల్యాణ్ గెలవడని ముద్రగడ పద్మనాభం ఛాలెంజ్ చేశారు. ఒకవేళ పవన్ కల్యాణ్ గెలిస్తే తన పేరు మార్చుకుంటానని ప్రకటించారు. ముద్రగడ పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని వివరించారు. ఆ అంశంపై వర్మ స్పందిస్తూ.. ఎన్నికల వరకు ఎందుకు ఇప్పుడే సిద్ధంగా ఉండు అని ప్రతి సవాల్ విసిరారు. 'పిఠాపురంలో పవన్ కల్యాణ్ భారీ మెజార్టీతో గెలవడం పక్కా. ముద్రగడ చెబితే పట్టుమని వంద ఓట్లు కూడా పడవు. పవన్ కల్యాణ్‌ను ఓడిస్తామని పగటి కలలు కంటున్నారు. వైసీపీలో ఎదుర్కొన్న అవమానాలను ముద్రగడ మరచిపోయినట్టున్నారు. పిఠాపురంలో పవన్ గెలవడం ఖాయం.. ఇంటి పేరు మార్చుకోవడానికి ముద్రగడ సిద్ధంగా ఉండాలి. ముద్రగడ కూతురే ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించింది. జగన్ మెప్పు కోసం పవన్‌ను తిట్టి ఎంతకాలం పబ్బం గడుపుతారు అని' వర్మ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తనపై కూతురు చేసిన వ్యాఖ్యలను ముద్రగడ ఖండించారు. కూటమి నేతలు కూతురి చేత విమర్శలు చేయించారని మండిపడ్డారు. పిఠాపురంలో కాపు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంది. పవన్ కల్యాణ్, ముద్రగడ ఇద్దరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. తెలుగుదేశం పార్టీ తరపున వర్మ టికెట్ ఆశించారు. పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ దక్కింది. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ బరిలోకి దిగారు.

# బెంగాల్లో హిందువులకు రోణ లేదు

## - రెండో తరగతి ప్రజలుగా చూస్తున్నారు - రాహుల్‌కు వయనాడ్‌లో ఓటమి ఖాయం
## - అందుకే రాయబరేలికి పారిపోయారు - బెంగాల్ ప్రచారంలో మోడీ విమర్శలు

కోల్‌కతా,మే3: బెంగాల్‌లో హిందువులు సురక్షితంగా లేరని ప్రధాని మోదీ అన్నారు. హిందువులను బహిరంగంగా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ హిందువులను రెండవ తరగతిగా పరిగణిస్తున్నారన్నారు. ఇటీవలి ఘటనలు కొన్ని ఇందుకు ఉదాహరణలని అన్నారు. టీఎంసీ, వామపక్షాలు, కాంగ్రెస్‌లకు అభివృద్ధి దృక్పథం లేదని ప్రధాని మోదీ ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒక రాష్ట్రానికి ఏం చేయగలవో అలోచించాలంటూ విజ్ఞప్తి చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్‌లో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ, టీఎంసీతోపాటు కాంగ్రెస్ నేత రాహుల్‌ను టార్గెట్ చేస్తూ ఘాటుగా విమర్శించారు.




ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, సరదాగా గడపడానికి పుట్టలేదని, నా కోసం జీవించాలని కోరుకోవడం లేదని అన్నారు. సేవ చేయాలనే సంకల్పంతో, 140 కోట్ల మంది గొప్ప భారత మాత దేశ ప్రజలకు సేవ చేయడానికి వచ్చానన్నారు. దేశ ప్రజలందరూ ఎంతగానో ఆశీర్వదించారు. భగవంతుని రూపంలో ఉన్న వ్యక్తులు ఇన్ని వరాలను కురిపిస్తారని, ఈ ఆశీర్వాదాలు మరింతగా పెరగాలని మోదీ ఆకాంక్షించారు.మీ కలలను నెరవేర్చుకోవడానికి జీవితంలో ఒకే ఒక కల ఉందన్న ప్రధాని మోదీ.. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని తయారు చేసేందుకు, స్వావలంబన భారత్‌గా మార్చేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నానన్నారు. నా భారతదేశం, నా కుటుంబం. నీ కలల కోసం దృఢ సంకల్పంతో జీవిస్తున్నానని తెలిపారు. ఇన్నేళ్లుగా మీరు నాకు అందించిన మద్దతు నన్ను నిరాడంబరపరిచింది. ఎవరైనా ప్రధానమంత్రి అయిన తర్వాత సులభంగా విశ్రాంతి తీసుకోవచ్చు. చరిత్రలో తన పేరును ఇప్పటికే నమోదు చేసుకు న్నాడు. కానీ, నేను ఆనందించడానికి ఇక్కడ లేనని, జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేయాలనుకుం టున్నాని ఉద్వేగభరితంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయడంపై ప్రధాని మోదీ తనదైన శైలి స్పందించారు. అమేథీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ ఇప్పటికే భయపడుతోందని ప్రధాని అన్నారు. భయపడవద్దు అంటూ రాహుల్ గాంధీకి సూచించారు. అమేథీని వదిలి రాయ్‌బరేలీకి రాహుల్ గాంధీ పారిపోయారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ వయనాడ్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, రాహుల్ వాయనాడ్‌లో ఓడిపోతారని ప్రధాని జోస్యం చెప్పారు. అందుకే వాయనాడ్ నుండి పారిపోయి రాయ్ బరేలీకి వచ్చాడన్నారు. కాంగ్రెస్ 2019 కంటే తక్కువ సీట్లు గెలుస్తుందన్న మోదీ, వీళ్లు ఊరూరా తిరుగుతూ భయపడకండి అని చెబుతుంటారని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీని కూడా ప్రధాని మోదీ టా÷-గ్గ÷ట్ చేశారు. కాంగ్రెస్‌లో అతిపెద్ద నేతకు ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేదన్నారు. రాజస్థాన్‌కు పారిపోయిన ఆమె రాజ్యసభకు వచ్చారన్నారు.

# కాంగ్రెస్ కంచుకోట నుంచి తప్పకున్న ఇందిర కుటుంబం

**లక్నో,మే3:** ఉత్తరప్రదేశ్ లోని అమేఠీ... ఐదేళ్ల క్రితం వరకు గాంధీ కుటుంబానికి ఇది పెట్టని కోట. 2019లో కమలదళ దండయాత్రలో ఈ సామ్రాజ్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది. దీంతో తాజా ఎన్నికల్లో దీన్ని తిరిగి దక్కించుకునే బాధ్యతను.. కాంగ్రెస్ అధిష్ఠానం గాంధీల నమ్మకస్థుడైన కిశోరీ లాల్ భుజానికెత్తింది. అలా పాతికేళ్ల తర్వాత తొలిసారి గాంధీ కుటుంబేతర వ్యక్తి ఇక్కడ పోటీకి దిగినట్లయ్యింది. గత నాలుగున్నర దశాబ్దాల్లో దాదాపు 31 ఏళ్లు అమేఠీ లోక్‌సభ నియోజకవర్గానికి గాంధీ కుటుంబసభ్యులు ప్రాతినిధ్యం వహించారు. 1980లో తొలిసారి సంజయ్ గాంధీ ఇక్కడి నుంచి గెలుపొందారు. ఆయన ఆకస్మిక మరణంతో మరుసటి ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో రాజీవ్ గాంధీ బరిలోకి దిగారు. అప్పటి నుంచి 1991 వరకు ఆయనే ఎంపీగా కొనసాగారు. ఇక, 1999లో సోనియా గాంధీ పోటీ చేయగా.. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అమేఠీని కుమారుడికి అప్పగించారు. అలా 2004 నుంచి రాహుల్ గాంధీ వరుసగా మూడుసార్లు ఇక్కడ విజయం సాధించారు. కానీ, గత ఎన్నికల్లో భాజపా నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో ఆయన ఓటమిపాలవడంతో కంచుకోటకు బీటలుపడ్డాయి. గాంధీ కుటుంబేతరులు ఈ స్థానం నుంచి పోటీ చేయడం గత మూడు దశాబ్దాల్లో ఇది రెండోసారి. 1991లో రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఈ స్థానాన్ని సతీశ్ శర్మకు అప్పగించింది. ఆ ఉప ఎన్నికల్లో గెలిచిన శర్మ.. 1996లో రెండోసారి విజయం సాధించారు. అయితే, 1998లో మాత్రం భాజపా చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ మరుసటి ఏడాదే మళ్లీ ఎన్నికలు జరగ్గా.. అమేఠీ మరోసారి కాంగ్రెస్ వశమైంది. అప్పటి నుంచి గాంధీ కుటుంబసభ్యులే పోటీ చేయగా.. మళ్లీ ఇన్నేళ్లకు ఇతరులకు అవకాశమిచ్చారు. తాజా ఎన్నికల్లో అమేఠీ నుంచి కిశోరీ లాల్ శర్మను నిలబెట్టారు. పంజాబ్‌లోని లుధియానాకు చెందిన కిశోరీ లాల్ గత నాలుగు దశాబ్దాలుగా గాంధీ కుటుంబానికి అత్యంత నమ్మకస్థుడు. 1987లో తొలిసారి ఈయన అమేఠీకి వచ్చారు. అప్పటి నుంచి ఈ నియోజకవర్గం కోసం పనిచేస్తున్నారు. 1999లో అమేఠీలో సోనియా గాంధీ విజయం సాధించడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. సోనియా ఈ స్థానాన్ని వదులుకున్న తర్వాత కూడా అమేఠీలో పార్టీ వ్యవహారాలను కిశోరీ పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఎంపికపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. 'కిశోరీ లాల్‌తో మా కుటుంబానికి చాలా ఏళ్లుగా అనుబంధం ఉంది. అమేఠీ, రాయ్‌బరేలీ ప్రజల కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన పోటీలో ఉండటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

# దోస్త్ నోటిఫికేషన్ విడుదల

## మే 6 నుంచి 25 వరకు తొలిదశ రిజిస్ట్రేషన్

**హైదరాబాద్,మే3:** తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ' (దోస్త్) నోటిఫికేషన్ విడుదలైంది. మే 6 నుంచి 25 వరకు మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.200 రుసుంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. మే 15 నుంచి 27 వరకు 'దోస్త్' వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 3న మొదటి దశ సీట్ల కేటాయింపు.. జూన్ 4 నుంచి 10 లోపు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు. రూ.400 రుసుంతో జూన్ 4 నుంచి 13 వరకు సెకండ్ ఫేజ్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నారు. జూన్ 4 నుంచి 14 వరకు సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్లు ఉంటాయి. జూన్ 18న రెండో దశ సీట్ల కేటాయింపు జరుగుతుంది. జూన్ 19 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు 'దోస్త్' మూడో దశ రిజిస్ట్రేషన్ ఉండనుంది. రూ.400 రుసుంతో మూడో విడత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. జూన్ 19 నుంచి 25 వరకు మూడో దశ వెబ్ ఆప్షన్లు ఉంటాయి.

# బోనులో చిక్కిన శంషాబాద్ చిరుత

## రాత్రి పట్టుకున్నట్లు అటవీ శాఖ వెల్లడి



**హైదరాబాద్,మే3:**ఎట్టకేలకు శంషాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కింది. ఐదు రోజులుగా చిరుత కోసం అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. దీన్ని పట్టుకోవడానికి ఐదు బోన్లు, 20 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ చిరుతను నెహ్రూ జూ పార్కుకు తరలించనున్నారు. జూలో దీని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు తరలించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. చిరుతపులి చిక్కడంతో పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఐదు రోజులుగా వీరంతా ప్రాణ భయంతో గడిపారు. చిరుత పూర్తి ఆరోగ్యంగా ఉందని ఎఫ్‌డీవో విజయానందరావు తెలిపారు. గురువారం రాత్రి సుమారు 8 గంటలకు బోనులో చిక్కిందని చెప్పారు. మేక మాంసం ఎర వేయడంతో బోనులోకి వచ్చిందన్నారు. దీన్ని జూకు తరలించి వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చిరుతను అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ జోన్‌లో వదలనున్నట్లు విజయానందరావు వివరించారు.

# వామన్ రావు దంపతుల హత్యపై ఉన్నతస్థాయి విచారణ

## సుప్రీంలో పిటిషన్ వేసిన లాయర్ దంపతుల కొడుకు

**న్యూఢిల్లీ,మే3:** తెలంగాణలోసంచలనం సృష్టించిన న్యాయవాదులు గట్టు వామన్ రావు దంపతుల హత్య వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. గట్టు వామనరావు దంపతుల హత్యపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని సుప్రీంకోర్టులో వామనరావు కొడుకు గట్టు కిషన్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై తాజాగా సీఐడీతో లేదా సీబీఐతో అయినా తిరిగి విచారణ జరిపించేందుకు తమకు అభ్యంతరం లేదని కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. ఈ కేసులో నిందితులను కూడా ప్రతివాదులుగా చేర్చి వారికి కూడా నోటీసులు ఇవ్వాలని పిటీషనర్‌కు సుప్రీం కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం నిందితులంతా బెయిల్‌పై ఉన్నారని కోర్టుకు పిటీషనర్ తరపు న్యాయవాది తెలిపారు. వారి వాదనలు కూడా విన్న తర్వాతనే తదుపరి నిర్ణయం తీసుకుంటామని జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్‌వీఎన్ బట్టిల ధర్మాసనం స్పష్టం చేసింది. సీఐడీతో మరోసారి విచారణ జరిపించ డానికి అభ్యంతరం లేదన్న రాష్ట్ర ప్రభుత్వ వాదనలను సుప్రీం ధర్మాసనం రికార్డు చేసింది. సీఐడీ లేదా సీబీఐతో విచారణ జరిపించే విషయంపై సమాధానం చెప్పాలని నిందితులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేసుకు సంబంధించిన వివరాలలో మరికొన్ని డాక్యుమెంట్లు సీడీలు అందించేందుకు పిటీషనర్‌కు సుప్రీం కోర్టు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

# ఎన్నికల వేళ..మద్యం అమ్మకాల జోరు !



ఎన్నికల వేళ మద్యం అమ్మకాలు పెరిగాయి. ఫలానా పార్టీ అన్న తేడా లేకుండా అన్ని పార్టీలు మద్యం డంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. కార్యకర్తలు కూడా మందులేనిదే అడుగు బయటపెట్టడం లేదు. దీనికితోడు ఎండాకాలం కావడంతో బీర్లకు యమ గిరాకీ పెరిగింది. ఎన్నికల సమయం కావడంతో తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఇకపోతే మద్యంపై అదుపు లేకుండా పోతోంది. ఇటీవల వరుసగా గంజాయి, మాదక ద్రవ్యాల పట్టివేత సంచలనంగా మారింది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని తనిఖీలు ముమ్మరం చేయడంతో డ్రగ్స్‌తో పాటు, గంజాయి పట్టుబడుతోంది. ఇకపోతే సులువుగా డబ్బు సంపాదించాలనుకున్న వారు ఈ వ్యాపారంలోకి దిగుతున్నారు. విస్తుగొలిపే విషయం ఏమంటే చదువుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఇందులో పడిపోతున్నారు. తేలికగా డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. మరోవైపు మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. ఎపిలో మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయవనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చి పెడుతోంది. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడు తోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చిన ఎపి సిఎం జగన్ ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల్లో కనీసం మాటమాత్రంగా అయినా మాట్లాడడం లేదు. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు ఎన్నికల ప్రచార వేళ అమ్మకాలు పెరిగాయి. పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. ఏ పార్టీ అయినా మద్యం, ముక్క ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నకల తేదీలు దగ్గర పడుతున్న వేళ..అన్ని పార్టీల కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు. అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగుతున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది. వారికి కఠిన శిక్షలు అమలు చేయాల్సి ఉంది. విపక్షాలు కూడా అధికార పక్షాన్ని విమర్శించడం, రాజకీయ లబ్దికోసం నానాయాగీ చేయడం సరికాదు. ఇలాంటి డ్రామాలు కట్టిపెట్టి సంఘటన జరిగినప్పుడు ఉమ్మడిగా ఎలా ముందుకు వెళ్లాలన్న ఆలోచనచేయాలి. ఇకపోతే ఇటీవల చోటు చేసుకుంటున్న సామూహిక అత్యాచార ఘటనలను చూస్తే సామాన్యలకు కూడా భయమేస్తోంది. బయటకు రావాలంటేనే జంకాల్సిన పరిస్థితి ఉంది. చిన్న పిల్లలను కూడా వదలడం లేదు. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించి కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇలాంటి ఘటనలన్నింటికి మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకం అన్నది ప్రధాన కారణమవుతోంది. ఆయా ఘటనల్లో నిందితులు పూటుగా మద్యం సేవించి.. ఆ మైకంలో ఉచ్చనీచాలు మరచి దుశ్చర్యలకు తెగబడుతున్నారు. మద్యం, గంజాయి విచ్చల విడిగా లభిస్తుండటంతో ఆ మైకంలో పైశాచికత్వానికి ఒడిగడుతున్నారు. అత్యాచార ఘటనల్లో అరెస్టవుతున్న నిందితుల్లో 60 శాతం మంది వరకూ మద్యం మత్తులో ఉన్నప్పుడే ఆ పైశాచిక చర్యకు పాల్పడుతున్నట్లు వెల్లడవుతోంది. మద్యం విచ్చలవిడిగా అమ్మడం,మాదక ద్రవ్యాల విషయంలో కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎన్ని అనర్థాలు జరుగుతున్నాయో పాలకులు గుర్తించాలి. మత్తులో పేట్రేగుతున్న ఉన్మాదులు..వరుసగా సామూహిక అత్యా చార ఘటనలకు పాల్పడుతున్న తీరును ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచన చేయాలి. అత్యాచార ఘటనల నిరోధానికి ఉమ్మడిగా పోరాడాలి. అనేక అత్యాచార ఘటనల్లో నిందితులు మద్యం మత్తులో రెచ్చిపోతు న్నారు. మద్యం, గంజాయి విచ్చలవిడిగా లభిస్తుండటంతో ఆ మైకంలో పైశాచికత్వాన్ని ప్రదర్శి స్తున్నారు. దీనికి ఫలానా వారు ప్రభుత్వంలో ఉన్నారు కనుక వారే బాధ్యులని నిందించలేం. ఎందుకంటే వారు చేసే అకృత్యాలకు అధికారపార్టీ వారు లైసెన్స్ ఇవ్వలేదు. వారు మద్యం మత్తులో చేసే ఘటనలు కనుక మద్యం అమ్మకాలపై ఆలోచన చేయాలి. ఇలాంటి ఘటనల్లో దోషులకు కఠిన శిక్షలు వేసేలా చేయాలి. మత్తులో ఉన్నవారికి విచక్షణ ఉండదు. తమ చర్యలపై నియంత్రణ ఉండదు. పశువాంఛ బయటపడే క్రమంలో అమానుష చర్యలకు తెగబడుతుంటారు. అలాంటి సందర్భాల్లో బాధితులు ఎవరైనా వారిని ఎదిరించినా, వారి నుంచి తప్పించు కోవటానికి ప్రయత్నించినా మరింత రెచ్చిపోతారు. హింసాత్మక చర్యలకు దిగుతారు. వీటిని మానసిక నిపుణులు కూడా అంగీకరిస్తున్నారు. మద్యం మత్తులో ఉండే వ్యక్తికి అదే మైకంలో ఉన్న మరో ఇద్దరు, ముగ్గురు తోడైతే వారి పశుత్వానికి అడ్డూ అదుపు ఉండదు. అలాంటి సందర్భాల్లో వారికి నిస్సహాయంగా, ఎదురించలేని స్థితిలో మహిళలు ఎవరైనా కనిపిస్తే అఘాయిత్యానికి తెగబడతారు. తాను ఒక్కడినే కాదని.. తనతో పాటు మరి కొందరు ఉన్నారన్న భరోసాతో మరింతగా రెచ్చి పోతారు. తమవల్ల వారికి ఏమవుతుందో అన్న భయం కానీ..తరవాత తామేవుతామో అన్న ఆలోచనకానీ ఆ సమయంలో ఉండదు. మత్తులో ఉన్న వారిలో దూకుడు స్వభావం, విపరీత ధోరణి ఉంటుంది. ఇదే నేరాలకు దారి తీస్తోంది.విపరీత ప్రవర్తన, సమాజంపై ద్వేష భావం ఉండేవారికి మద్యం మత్తు తోడైతే అది తీవ్రమైన నేరాలకు కారణమవుతుంది. అందువల్ల మద్యం,గంజాయి లభ్యం కాకుండా అరికట్టే మార్గాలు ఆలోచించాలి. అప్పుడే సమాజంలో ప్రశాంత వాతావరణం రాగలదు.

# సామాన్యులకు ధారాఘాతం

## - ధరల దాడిపై కిమ్మనని పాలకులు - ఎన్నికల వేళ పట్టింపులేని నేతలు

**న్యూఢిల్లీ,మే3:** అడ్డూ అదుపు లేకుండా పెరుగుతన్న నిత్యావసరాల ధరలు సామాన్య,మధ్య తరగతి ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. బియ్యం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, పెట్రోల్.. ఇలా అన్నింటి ధరలు అందనంతగా పెరిగిపోతున్నాయి. వీటికి తోడు మందుల ధరలు కూడా సైలెంట్‌గా పెంచేశారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు దాడి చేస్తున్నాయి. పెట్రో ధరలతో అన్నిరకాల వస్తువుల ధరలు దాదాపు రెండింతలు అయ్యాయి. చాయ్ సింగిల్ కనీసం 15 రూపాయలుగా అమ్ముతు న్నారు. మూడేళ్లలో నెలసరి ఇంటి ఖర్చులు ఏకంగా 5 వేలు దాటేశాయి. ఈ ధరాఘాతంతో బతకలేక సామాన్యులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ ధరలకు తోడు కరెంటు బిల్లులు, పెట్రోల్ బాదుడు కూడా అదనంగా వచ్చి చేరింది. మరింత అదనంగా జిఎస్టీ వాయిస్తోంది. ప్రభుత్వాలు ధరలను అరికట్టే చర్యలకు పూనుకోవడం లేదు. ధరలు పెరగడం సహజం అన్న ధోరణిలో ఉన్నారు. తమకు అందుబాటులో ఉన్న పెట్రోల్, గ్యాస్, విద్యుత్ తదితర వస్తువులపై వడ్డింపులు వేస్తూనే ఉన్నారు. ఎన్నికల్లో ధరలపై గట్టిగా మాట్లాడడం లేదు. దీనికితోడు జిఎస్టీ వడ్డింపులు శరాఘతంగా మారాయి. సామాన్యులు బతకడం దుర్లభంగా మారింది. ధరల పెరుగుదలను తలచుకుంటేనే మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఇంటి ఖర్చు సగటున నెలకు రూ.5వేలకు పైగా పెరిగింది. ప్రతి ఒక్కరిపైనా ఏటా 5 నుంచి 10 శాతం పెంపుతో అదనపు భారం తప్పదు. పంటలు దెబ్బతిని గ్రామాల్లో ఉపాధి కరవైంది. అటు పనుల్లేక, ఇటు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, మినప్పప్పు, పెసరపప్పుల ధరల్లో పెరుగుదల అధికంగా ఉంది. కరోనా సమయంలో ధరలు భారీగానే పెరిగినా తర్వాత కాస్త నెమ్మదించాయి. కొంతకాలంగా నిలకడగా సాగుతున్నాయి. గతంలో 3 నెలలకు రూ.333 ఉండే రీఛార్జ్.. ఇప్పుడు రూ.666కు చేరింది. దీనికి తోడు వై-ఫై రూపంలో నెలకు రూ.500 వరకు అదనపు భారం తప్పట్లేదు. కేబుల్ టీవీ ఖర్చు రూ.250 వరకు అదనం. ఒక్కో ఓటీటీ ఛానెల్‌కు సగటున రూ.500 చొప్పున నాలుగు తీసుకున్నా.. రూ.2 వేలు. అంటే నెలకు రూ.166 చొప్పున ఖర్చవుతుంది. ఒక్కో కుటుంబంపైనా మొబైల్, కేబుల్ బిల్లుల రూపంలోనే నెలకు రూ.600 వరకు అవుతోంది. వై-ఫై, ఓటీటీ తీసుకున్న కుటుంబాలకు నెలకు రూ.1,000 చొప్పున తప్పట్లేదు. 2019 మధ్యలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.600 వరకు ఉంది. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1150అయింది. అప్పటితో పోలిస్తే రాయితీ కూడా తగ్గిపోయింది. రూ.15 చొప్పునే నామమాత్రంగా ఇస్తున్నారు. నెలకు ఒక సిలిండర్ లెక్కన చూస్తే.. ఒక్కో కుటుంబంపై రూ.372 చొప్పున భారం పడుతోంది. ఇక పెట్రోల్, డీజిల్ ధరల గురించైతే చెప్పనక్కర్లేదు. చిరు వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులకు ద్విచక్రవాహనం భారమైపోయింది. నెలకు సగటున 25 లీటర్ల పెట్రోల్ లెక్కన చూసినా రూ.1,100 వరకు ఖర్చు పెరిగింది. 2019లో రూ.75లోపు ఉన్న పెట్రోల్ ధర.. ప్రస్తుతం రూ.121 వరకు చేరింది. లీటరుకు రూ.45కు పైగానే పెరిగింది. ఇంజిన్ ఆయిల్ ధర రూ.300 నుంచి రూ.500కు చేరింది. ఇప్పుడు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో మరింత ఎగిశాయి. బ్రాండెడ్ టీపొడి ధర గతంలో కిలో రూ.540 ఉండేది. ప్రస్తుతం రూ.780 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, యాలకులు, తులసి, అశ్వగంధ వంటి ఉత్పత్తులతో తయారయ్యే ఒక సంస్థ టీ పొడి.. 2019లో రూ.380 ఉండేది. ప్రస్తుతం రూ.800కు పైనే చేరింది. లీటర్ పాల ధర గతంలో రూ.55 నుంచి రూ.58 మధ్య ఉండేది. ఇప్పుడు సగటున రూ.64 నుంచి రూ.68 వరకు ఉంది. నెలకు 30 లీటర్లకు రూ.300 అదనంగా ఖర్చవుతోంది. సబ్బులు, డిటర్జెంట్ ఉత్పత్తుల ధరలూ.. 30 శాతం వరకు పెరిగినట్లు అంచనా. వీటికి తోడు ఇంట్లో వాడే ఒంటి సబ్బులు,ఫేస్‌క్రీమ్, షాంపూ ధరలూ రెట్టింపయ్యాయి. పాత్రలు కడిగే సబ్బు ధర మూడేళ్ల కిందట రూ.45 ఉంటే ఇప్పుడు అది 51 శాతం పెరిగి.. రూ.68కి చేరింది. టూత్‌పేస్ట్ ధర 2019లో రూ.79 ఉంటే.. ఇప్పుడు రూ.96 రూపాయలకు పైగానే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రకాల వస్తువులపైనా ధరలు పెరిగాయి. ఉల్లిపాయల ధరలు 25కిలో దగ్గర స్థిరంగా ఉన్నాయి. అయితే ఈ ధరలపై పాలకులు పట్టించుకోవడం లేదు. వ్యాపారులు ఏ వస్తువు రేటు ఎందుకు పెంచుతున్నారో ఎవరికీ తెలియడం లేదు.

# అమేఠీ, రాయబరేలిపై వీడిన ఉత్కంఠ

## - రాయబరేటి నుంచి బరిలోకి దిగనున్న రాహుల్ - అమేథీలో కాంగ్రెస్ సన్నిహితుడు శర్మ పోటీ

**న్యూఢిల్లీ,మే3:** ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేటి, అమేఠీ సీట్లపై ఉత్కంఠకు తెరపడింది. సోనియా రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లడంతో రాయబరేలి నుంచి ఇప్పుడు ఆమె తనయుడు రాహుల్ రాయబరేలిలో పోటీకి దిగబోతున్నారు. ఇకపోతే అమేఠీలో గత సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ స్మృతి ఇరానీ చేతిలో ఓడిపోయారు. ఇప్పుడు అక్కడ కాంగ్రెసేతర నేత కిశోరీలాల్ శర్మను బరిలోకి దింపింది. ఈ రెండు సీట్ల అభ్యర్థలను కాంగ్రెస్ ప్రకటించింది. దిల్లీ పీఠం దక్కించుకోవాలంటే ఎవరైనా సరే 80 పార్లమెంట్ స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌పై పట్టు సాధించాల్సిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ కూడా ఇక్కడ తాను ఏమాత్రం తగ్గకూడదని నిర్ణయించుకొంది. ప్రత్యర్థులు తమపై చేస్తున్న ప్రచారానికి చెక్‌పెడుతూ అగ్రనేత రాహుల్ గాంధీ తన తల్లి సోనియా స్థానాన్ని నిలబెట్టుకొనేందుకు రాయ్‌బరేలీలో



పోటీచేసేందుకురంగంలోకి దిగారు. 1952 నుంచి రాయ్‌బరేలీ నియోజకవర్గం గాంధీల కుటుంబానికి 38 ఏళ్లపాటు కంచుకోటగా నిలిచింది. తొలుత ఇక్కడి నుంచి ఇందిరా గాంధీ భర్త ఫిరోజ్ గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఇందిరా 1967 నుంచి 1980 వరకు ఇక్కడి నుంచి పోటీచేశారు. 1977లో మినహా అన్ని సార్లూ ఆమె విజయం సాధించారు. 1971 ఎన్నిక వివాదాస్పదం కావడంతో ఆమెకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు వచ్చింది. ఆ తర్వాత ఎమ్జర్గ÷న్సీ విధించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో జనతాపార్టీ అభ్యర్థి రాజ్‌నారాయణ్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఎన్నికల్లో రాయ్‌బరేలీ, మెదక్‌ల నుంచి పోటీ చేసి గెలిచినా.. చివరి వరకూ మెదక్ స్థానానికి పరిమితమయ్యారు. ఇక సోనియా గాంధీ 2004 నుంచి వరుసగా ఇక్కడ విజయం సాధిస్తూ వస్తున్నారు. తాజాగా వ్యక్తిగత కారణాల రీత్యా రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళ్లారు.

# ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

## జూలై చివరి వారానికి వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,మే3:** సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణను జూలై చివరి వారంలో నిర్వహిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఓటుకి నోటు కేసు విచారణను మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలన్న పిటిషన్‌పై కౌంటర్‌ను సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం ఫైల్ చేయలేదు. గత విచారణ సందర్భంగా రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం, ప్రతివాదులకు కౌంటర్ దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ ఫైల్ చేయకపోవడంతో కేసు విచారణ వాయిదా పడింది. ఓటుకి నోటు కేసు విచారణ మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పిటిషన్ వేశారు. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ కేసు విచారణ తెలంగాణలో కాకుండా మధ్యప్రదేశ్‌లో జరిగేలా బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు గుంతకండ్ల జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, మహ్మద్ అలీ, కల్వకుంట్ల సంజయ్‌లు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా ప్రతివాదులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆ సమయంలో ఆదేశించింది. కాగా, విచారణ సందర్భంగా దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉండగా మధ్యప్రదేశ్ కు మాత్రమే ఎందుకు మార్చాలని పిటిషనర్ల తరుపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది.

# యువతను గంజాయి మత్తుకు బానిసలు చేశారు

## ముఠా కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

## వైకాపా ప్రభుత్వం తీరుపై మండిపడ్డ జనసేనాని

**ఏలూరు,మే3:** వైకాపా ప్రభుత్వం యువతను గంజాయి మత్తుకు బానిస చేసిందని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శించారు. రాష్ట్ర భవిష్యత్‌కు ఈ ఎన్నికలు ఎంతో కీలకమని, ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా కైకలూరులో నిర్వహించిన వారాహి విజయభేరి సభలో పవన్ ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మికుల కోసం గళమెత్తిన పార్టీ జనసేన అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఠా కూలీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు భయపడకుండా బతకాలన్నదే తన కోరికన్న పవన్.. సమస్యల పరిష్కార బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. 'వైకాపా పాలనలో 112 మంది జర్నలిస్టులపై దాడులు జరిగాయి. 430 కేసులు నమోదు చేశారు. మీడియాను కట్టడి చేసేందుకు జీవో నెంబర్ 1 తీసుకొచ్చారు. అసెంబ్లీలో చర్చ జరగకుండానే, భూములు దోచేసే చట్టం తీసుకొచ్చారు. మన ఆస్తి.. మనదని రుజువు చేసుకోవాలా?90 రోజుల్లో రుజువు చేసుకోకపోతే దోచుకుంటారా? వంద గజాల భూమి ఉన్న వ్యక్తి కూడా న్యాయం కోసం హైకోర్టు తలుపు తట్టాలా?' అని పవన్ ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే కైకలూరు నియోజకవర్గంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

# వీడియో కాన్ఫరెన్స్ వద్దు

## నేరుగా విచారణకు హాజరవుతా : కవిత

**న్యూఢిల్లీ,మే3:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీ మే 7వ తేదీతో ముగియనుంది. దీంతో ఆమెను అధికారులు కోర్టు ముందు హాజరుపరచనున్నారు. అయితే, తనను కోర్టుకు నేరుగా హాజరుపరచాలని.. వీడియో కాన్ఫరెన్స్ వద్దని కోర్టును కవిత కోరారు. ఈ మేరకు కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవిత విచారణ ఖైదీగా తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే, గతంలో కస్టడీ ముగిసినప్పుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమెను అధికారులు కోర్టు ధర్మాసనం ఎదుట హాజరుపరిచారు . ఇప్పుడు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరుపరిచే అవకాశం ఉంది. దీంతో.. ఈ విచారణకు నేరుగా హాజరుపరచాలని కోరుతూ కోర్టు అప్లికేషన్ పెట్టుకున్నారు. ఈ కేసులో కవిత అరెస్టైనప్పటి నుంచి నాలుగుసార్లు కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ధర్మాసనం పొడించింది. కోర్టుకు హాజరైన సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఏర్పడింది. అయితే, గతంలో కోర్టులో విచారణకు హాజరైన కవిత.. మీడియాతో మాట్లాడారు. ఈ చర్యపై ట్రయల్ కోర్టు జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తదుపరి విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు అధికారులు. కానీ, ఈసారి అలా చేయబోనని.. తనను నేరుగా కోర్టుకు హాజరుపరచాలని కోర్టును కోరారు ఎమ్మెల్సీ కవిత. మరి దీనిపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే తెలియాలి.

# అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసు

## ఐదుగురికి డిషన్ బెయిల్ మంజూరు

**హైదరాబాద్,మే3:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ కేసులో ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరు అయ్యింది. ఈకేసులో టీపీసీసీ సోషల్ మీడియా టీమ్ మెంబర్స్ పెండ్యాల వంశీకృష్ణ, మన్నె సతీష్, నవీన్, ఆస్మా తస్లీమ్, గీతలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను ఈరోజు నాంపల్లి కోర్టులో హాజరుపర్చరగా.. వారికి కోర్టు కండిషనల్ బెయిల్ మంజూరు చేసింది. పది వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు అయ్యింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు నిందితులు ప్రతీ సోమ, శుక్ర వారాలు కేసు ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్స్ ముందు హాజరు కావాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. మరోవైపు ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ పోలీసులు హైదరాబాద్‌లోనే మకాం వేశారు. హస్తిన పోలీసులు నిన్నటి నుంచి హైదరాబాద్‌లోనే ఉండిపోయారు. హైదరాబాద్ పోలీసుల అదుపులో ఉన్న ఐదుగురిని అరెస్ట్ చేయాలని ఢిల్లీ పోలీసులు చూస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో అరెస్ట్ అయిన ఐదుగురిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రాత్రంతా విచారించారు. ఫేక్ వీడియో కి సంబంధించిన కంప్యూటర్లు, హార్డిస్కులు, పెన్ డ్రైవ్‌ను హైదరాబాద్ పోలీసులు సీజ్ చేశారు.

# సిఎం రేవంత్ సవాల్ స్వకీరిస్తున్నా

**ఆరు గ్యారెంటీలు..రుణమాఫీ చేయాల్సిందే**

**అప్పడే రాజీనామాతో సిద్దంగా ఉంటా**

**సిద్దిపేటలో సిఎం రేవంత్‌కు సన్మానం చేస్తా**

**సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**


**సిద్దిపేట,మే3:** సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మరోసారి స్పష్టం చేశారు. పంద్రాగస్టులోగా ఆరు గ్యారెంటీలు, రూ. 2 లక్షల రుణమాఫీ అమలు చేస్తే.. రాజీనామా చేస్తానని ఆయన తేల్చిచెప్పారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.కాంగ్రెస్ బాండ్ పేపర్ బౌన్స్ అయిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.ప్రెస్ అకాడమీ చైర్మన్ వద్ద ఇద్దరి రాజీనామాలు ఉంచుదాం. రేవంత్ రెడ్డి రాజీనామా లేఖ ఇచ్చిన 10 నిమిషాల్లోనే తన రాజీనామా లేఖ పంపిస్తాను. స్పీకర్ ఫార్మాట్‌లోనే రాజీనామా లేఖ అందజేస్తాను. పంద్రాగస్టు లోగా ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామా ఆమోదించుకుంటాను. ఆ తర్వాత సిద్దిపేటకు రేవంత్ రెడ్డిని పిలిపించి శాలువాతో సన్మానం చేస్తానని పేర్కొన్నారు.

# రామన్నపేటలో ఇంటింటి ప్రచారం



**వరంగల్ :** గ్రేటర్ వరంగల్ 29వ డివిజన్ పరిధిలోని రామన్నపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్ ప్రచారంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు వినయ్ భాస్కర్...

## ఎండ తీవ్రత కు గురికాకుండా జాగ్రతలు పాటిద్దాం



**హనుమకొండ:** వాతారణశాఖ వారి హెచ్చరికల ప్రకారం మరియు జిల్లా కలెక్టర్ గారి ఆదేశముల మేరకు ప్రజలకు తెలియ చేయునది ఏమనగా జిల్లాలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండటం, వడ గాలులు వల్ల "వడదెబ్బకు" గురయ్యే అవకా శం కలదని కావున ప్రజలందరూ తగిన జాగ్రతలు తీసుకోవాలని హను మకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్.బి. సాం బశివ రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలంలో వడ దెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం (తగ్గడం),మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళే అన్ని లక్షణాలు గాని లేక కొన్ని లక్షణాలు గాని కనిపిస్తాయని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ గల ప్రదేశానికి చేర్చాలి, శరీరాన్ని చల్లని నీటిలో మంచిన గుడ్డతో తుడవాలి, ఎండ దెబ్బ తగిలిన వారికి ఉప్పు కలిపిన మజ్జిగ, చల్ల, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజు, ఓఆర్ఎస్ ద్రావణాన్ని త్రాగించాలి, సత్వర చర్యల కొరకు 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసిన తరువాత దగ్గరలో గల ఆరోగ్య కేంద్రం/ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని అయిన తెలిపారు.ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం/ఆడటం చేయరాదు, తప్పనిసరి పరిస్థితులలో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలి, తెల్లని నూలు వస్త్రాలు ధరించాలి, నీరు మరియు ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి, మత్తు పానీయాలు తీసుకోరాదు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు,గర్భిణీ స్త్రీ లు, ఇతర అనారోగ్యంతో బాధపడేవారు వేసవి కాలంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. అలాగే బయట పనికి వెళ్ళేవారు ఉదయం మరియు సాయంత్రం వేళలలో పని చేసుకొని మధ్యహాన్నం విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం, ఉప కేంద్రం, అంగ న్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో, గ్రామ పంచాయత్ లలో ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో కలవు కావున అవసరం ఉన్నవారు ఉపయోగించుకోగలరని పైన తెలిపిన జాగ్రత్తలు పాటిస్తూ వడ దెబ్బకు గురి కాకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు. ఎన్నికల విధులు, ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనే వారు తగిన వ్యక్తి గత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## నేరాల నియంత్రణకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం: పోలీస్ కమిషనర్

**ఖమ్మం :** నేరాల నియంత్రణకు పోలీస్ పెట్రోలింగ్, నిఘా వ్యవస్థను మరింత పటిష్ట పరచాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వైరా డివిజన్ పోలీస్ అధికారులతో జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై పోలీస్ కమిషనర్ సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ...బాధితులకు న్యాయం జరగాలంటే కేసుల దర్యాప్తులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వుండాలని,
నేరం జరిగాక ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళిక



బద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు.దొంగతనాల నియంత్రణ,చోరి సోత్తు రికవరీ, పాత నేరస్తుల కదలికలపైపోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేస్తూ..రాత్రి గస్తీ పెంచాలన్నారు. అదేవిధంగా బస్టాండ్లలో, ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాలు విజబుల్ పోలీసింగ్ అమలులో చేయాలని సూచించారు. బహిరంగ మద్యపానం, పబ్లిక్ న్యూసెన్స్, రాష్ డ్రైవింగ్, రాత్రి సమయాల్లో సమయానికి మించిషాపులు తెరవడం వంటి వారిపై సిటీ పోలీసు యాక్టు అమలు చేసి కోర్టులో హాజరు పరచాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఉపయోగం, మతు పదార్థాల వలన కలిగే అనార్థాల,ఆర్థిక పరమైన మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాలు వేగాన్ని నియంత్రించడానికి రోడ్డుపై బారిగేట్స్ ,కోన్స్ లను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు ,వాహనాల తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.లోకసభ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల మీదుగా వచ్చే గంజాయి, నగదు, మద్యం అక్రమ రవాణాను నియంత్రించాని అన్నారు.చెక్ పోస్ట్ లను విధిగా తనిఖీ చేయాలని, అదేవిధంగా గత ఎన్నికలలో జరిగిన నేరాలను సమీక్షించి ఆయా ప్రాంతాల్లో మరోసారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.సమావేశంలో వైరా ఏసీపీ రహెమాన్, సీసీఆర్బీ ఏసీపీ సాంబరాజు, సిఐలు సాగర్, మధు ,ఎస్సైలు పాల్గొన్నారు.

# వరంగల్ నగరంలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్











**ఇంతేజార్ గంజ్ :** ఎన్నికలు ప్రశాంతంగా నిర్వ హించడంలో భాగ ంగా స్థానిక పోలీసులతోపాటు సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వ ర్యంలో మట్టేవాడ, ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీ స్ కవాతు నిర్వహించారు . వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పాల్గొన్న ఈ కవాతు పోచమ్మమైదన్ నుంచి ప్రారం భమైన కవాతు మండిబజార్, చౌరస్తా, వరంగల్ రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. ఈ నంద ర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లా డుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, అర్బన్ ప్రజల ఓట్ల శాతం పెం చడంతోపాటు ఎన్నికల వేళ శాంతి భద్రతలపై ప్రజ లకు నమ్మకం కలిగించేందుకు ఈ పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందని. ఈ కవాతు లో మూడు కంపెనీల సి.ఆర్.పి.ఎస్,సివిల్, డిస్ట్రిక్‌గార్డ్స్ పోలీ సులు పాల్గొన్నారని.కార్య క్రమంలో డీసీపీ అబ్దు ల్ భారీ, ట్రైనీ ఐపిఎస్ శుభంనాగ్, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్, ఏసీపీ లు ,నందిరామ్ నాయక్, దేవేందర్ రెడ్డి, తిరుమల్తో పాటు సెంట్రల్ జోన్ ఇన్స్పెక్టర్లు ఎస్.ఐలు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## దోస్తు నోటిఫికేషన్ విడుదల




**హైదరాబాద్ :** ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి రాష్ట్రంలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి దోస్తు నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిమొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్మే 6 తేదీ నుండి ను మే 25 వరకు చేసుకోవాలి 200 రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజుతో

## వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వరంగల్ జిల్లాకు చెందిన ఏనుగుల రాకేష్ రెడ్డి గారిని ప్రకటించిన కెసిఆర్





**వరంగల్:** ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుండి BRS లో చేరి క.ఉమ్మడి వరంగల్, ప్రస్తుత హన్మకొండ జిల్లాలోని హాసన్పర్తి మండలం, వంగప హాడ్ వారి సొంతూరు. సామాన్య రైతు కుటు ంబం నుండి వచ్చిన రాకేష్ రెడ్డి గారు. బిట్స్ పిలాని లో సిటీ బ్యాంక్ మేనేజర్ గా, జేపీ మోర్గాన్, ఫేస్బుక్ లాంటి పలు అంతర్జాతీయ కార్పోరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేసి రాజకీయాలపై ఆసక్తి తో రాజకీయాల్లోకి ప్రవేశం.
2013 లో భారతీయ జనతా పార్టీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు.అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేపీ లో రాష్ట్ర కార్యదర్శిగా, 2 పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతినిధి గా పనిచేశారు. బీజేపీ లో వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన రాకేష్ రెడ్డి వరంగల్ కేంద్రంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేసి ప్రజల్లోకి చొచ్చుకెళ్ళారు.ఉన్నత విద్యావంతుడు, మంచి వాగ్ధాటి, క్లీన్ ఇమేజ్ తో పాటు, క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఫలితాలు రాబట్టగల సమర్ధత, కష్టపడి పనిచేసే సొంత టీమ్ ఉంటడం వారికి కలిసొచ్చే అంశాలు.యువతలో, విధ్యావంతులలో మంచి పట్టు న్న రాకేష్ రెడ్డికి రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు, ఒక కల్ట్ ఫాలోయింగ్ ఉండటం తో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గా ప్రకటించిన కెసిఆర్.ఇప్పటికే కాంగ్రెస్ తమ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న ను ప్రకటించిన నేపథ్యంలో అందుకు దీటైన అభ్యర్థిని దించడం కోసం తీవ్ర కసరత్తు చేసిన అధిష్టానం పలువురి పేర్లు పరిశీలించి ఫైనల్ గా ఏనుగుల రాకేష్ రెడ్డి నే ఫైనల్ చేసింది.

## జర్నలిస్టులారా... ఆరోగ్యం జాగ్రత్త

**వరంగల్, 3 మే 2024.** రాజకీయాల్లో ఎవరి స్వార్థం వాడిదే..వారికి ప్రచారం కావాలి – ఓట్లు కావాలి.– పాత్రికేయుల జీవితాలపై వారికి పట్టింపు లేదు.కాబట్టి మన కుటుంబ సభ్యుల కోసం మనకోసం మనం జాగ్రతగా ఉండాలి. ఎన్నికల సందర్భంగా జర్నలిస్ట్ లకు ఆదాయం ఏమి వచ్చిందో తెలియదు కానీ వడ దెబ్బకు మాత్రం చాలా ఇబ్బంది పడుతున్నారు.ప్రెస్ మీట్ లు పెట్టే నేతలుకార్లలో తిరుగుతారు. వాళ్ళ మీటింగ్ లకు హాజరయ్యే జర్నలిస్ట్ లు మాత్రం ఎండల్లో తిరుగు తున్నారు. మీరు పెట్టే సభలు, మీడియా సమావేశాల కోసం ద్విచక్ర వాహనాలపై తిరిగే జర్నలిస్టుల కు కూడా కార్లు ఏర్పాటు చేయడం ఆయా పార్టీల అభ్యర్థులు బాధ్యతగా భావించండి.భోజనం ఏర్పాటు చెయ్యాలి అంటే మిట్ట మధ్యాహ్నం 12 గంటల తర్వాతే పెట్టాలి అనే నిబంధన లేదు. ఎప్పుడు ఆకలేస్తే అప్పుడు తినండి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోండి.నెత్తిన టోపీ తప్పక ధరించండి.విపరీతమైన ఎండ వేడి నేపథ్యంలో ఉదయం 11 గంటల లోపు ముగిసేలా మీడియా సమావేశాలు ఏర్పాటు చేస్తే శేయస్కరం. ఆయా పార్టీల నాయకులు, పోటీ చేసే అభ్యర్థులు ఆ దిశగా ఆలోచన చేయండి.ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో వడదెబ్బ తగిలిన జర్నలిస్టులు ఎక్కువగానే ఉన్నారు ఎన్నికలు తర్వాత.. అవి ఆగేవి కావు ... జరుగుతాయి.. వాటికంటే ముందు మీ ఆరోగ్యం జాగ్రత్త.

## వరదాయపల్లెలో టిడిపి ఎన్నికల ప్రచారం... పాల్గొన్న వీఆర్ వెంకటేశ్వర్ రెడ్డి...



**తాడిపత్రి, మే 2,:** తాడిపత్రి మండల పరిధిలోనీ వరదాయ పల్లె గ్రామంలో టిడిపి నాయకుడు.వి ఆర్ .వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను విఆర్ వెంకటేశ్వర రెడ్డి ప్రజలకు వివరించారు.



ఈ కార్యక్రమంలో జయరాం రెడ్డి, సంజీవరెడ్డి, గోపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామాంజనేయులు, దుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో హెూమోటింగ్ ద్వారా 121 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగం

### ఫెసిలిటేషన్ కేంద్రాల్లో నేడు 27 ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగం. వరంగల్ డీఈఓ, కలెక్టర్ పి. ప్రావీణ్య

**వరంగల్, 3 మే 2024.** వరంగల్ జిల్లాలో నేడు హెూమ్ ఓటింగ్ ద్వారా 121 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వరంగల్ డీఈఓ, కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు.వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో 60 మంది, వర్ధన్నపేట వర్గ పరిధిలోని 61 మంది 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు పిడబ్ల్యుడి ఓటర్లు హెూమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు . అదేవిధంగావరంగల్ జిల్లాలోనివరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేటఫెసిలిటేషన్ కేంద్రాల్లో నేడు 27 ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ఎల్బీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఫెలిసిటీషన్ సెంటర్ లో శుక్రవారం 25 మంది ఉద్యోగులు, వర్ధన్నపేట లోని తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా మొత్తం 27 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.



# చెన్నై జట్టును వీడిన స్టార్ ప్లేయర్లు




గతేడాది ఛాంపియన్ గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడింది. ఈ పది మ్యాచ్‌ల్లో 5 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. మొత్తం 10 పాయింట్లతో పాయింట్ల పట్టికలో చెన్నై జట్టు 4వ స్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ , సన్ రైజర్స్ హైదరాబాద్ కూడా 10 పాయింట్లతో ప్లేఆఫ్ రేసులో ఉన్నాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17 లీగ్ మ్యాచ్‌లు కీలక దశకు చేరుకున్నాంది. అన్ని జట్లు ఇప్పటికే 10 మ్యాచ్‌లు ఆడగా 4 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ మ్యాచ్‌లే ప్లేఆఫ్‌కు వెళ్లే 4 జట్లను నిర్ణయిస్తారు. గతేడాది ఛాంపియన్ గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడింది. ఈ పది మ్యాచ్‌ల్లో 5 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. మొత్తం 10 పాయింట్లతో పాయింట్ల పట్టికలో చెన్నై జట్టు 4వ స్థానంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ , సన్ రైజర్స్ హైదరాబాద్ కూడా 10 పాయింట్లతో ప్లేఆఫ్ రేసులో ఉన్నాయి. కాబట్టి చెన్నై జట్టు తదుపరి 4 మ్యాచ్‌లలో గెలిస్తేనే నేరుగా ప్లే ఆఫ్‌లోకి ప్రవేశిస్తుంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో చెన్నై జట్టుకు వరుసగా షాక్ లు తగులుతున్నాయి. అదేంటంటే.. చెన్నై జట్టు ఆడే తదుపరి మ్యాచ్‌లకు కొంతమంది స్టార్ ఆటగాళ్లు అందుబాటులో ఉండడం లేదు. వీరిలో ప్రముఖ పేసర్లు ముస్తాఫిజుర్ రెహమాన్, మతిష్ పతిరానా కూడా ఉన్నారు. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం ముస్తాఫిజుర్ రెహ్మాన్ స్వదేశానికి తిరిగి వచ్చాడు. మే 3 నుంచి బంగ్లాదేశ్-జింబాబ్వే మొత్తం 5 టీ20 మ్యాచ్‌లు ఆడనున్నాయి. ఈ సిరీస్ కారణంగా ముస్తాఫిజుర్ రెహ్మాన్ చెన్నై జట్టు తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. మరోవైపు మతిష్ పతిరనా, మహిష్ తీక్షణ శ్రీలంకకు తిరిగి వచ్చారు. త్వరలో జరగనున్న టీ20 ప్రపంచకప్ జట్టులో ఇద్దరు సీఎస్‌కే ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. ఇప్పుడు లంక ఆటగాళ్లు చెన్నై సూపర్ కింగ్స్ జట్టును వదిలి వీసా సంబంధిత పనుల కోసం కొలంబో వెళ్లారు. కాబట్టి ఈ ఇద్దరు ఆటగాళ్లు కూడా తదుపరి మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. అలాగే గత మ్యాచ్‌లో దీపక్ చాహర్ గాయపడటంతో మైదానం వీడాడు. ఆ తర్వాత మళ్లీ మైదానంలోకి రాలేదు. ఫిట్‌నెస్ సమస్యతో బాధపడుతున్న దీపక్ చాహర్ తదుపరి మ్యాచ్‌లో కూడా ఆడడం అనుమానమే. మరో పేసర్ తుషార్ దేశ్‌పాండే జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడలేదు. ఒకవేళ పూర్తిగా కోలుకోకపోతే తుషార్ కూడా తదుపరి మ్యాచ్‌కు దూరం కానున్నాడు. అంటే మే 5న పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోని ఐదుగురు బౌలర్లు ఔట్ అయ్యే అవకాశం ఉంది.

# ముంబై జట్టునుండే అత్యధిక ఆటగాళ్ల ఎంపిక

10 జట్లలో 6 జట్ల ఆటగాళ్లు 15 మంది సభ్యుల జాబితాలోకి వచ్చారు. మిగిలిన 4 జట్లలో 2 జట్ల నుంచి ఇద్దరు ఆటగాళ్లను రిజర్వ్ ప్లేయర్‌లుగా ఎంపిక చేయగా, మిగిలిన రెండు జట్ల నుంచి ఒక్క ఆటగాడు కూడా భారత ప్రపంచ కప్ జట్టులో ఎంపిక కాలేదు. జూన్‌లో జరగనున్న ప్రపంచ కప్ 2024 కోసం అత్యధిక ఆటగాళ్లను ఎంపిక చేసిన జట్టు ముంబై ఇండియన్స్. ఈ భారీ టోర్నీకి ముంబై నుంచి ఇంత మంది ఆటగాళ్లు టీమ్ ఇండియాలో ఎంపిక కావడం ఇదే తొలిసారి కాదు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టును ప్రకటించారు. దీని ప్రకారం భారత జట్టులో 15 మంది ఆటగాళ్లను ఎంపిక చేయగా నలుగురిని రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపిక చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లో మొత్తం 19 మంది ఆటగాళ్లలో ఏ జట్టు నుంచి ఎంత మంది ఆటగాళ్లను ఎంపిక చేశారో చూస్తే.. 10 జట్లలో 6 జట్ల నుంచి 15 మంది ఆటగాళ్లు జాబితాలో చోటు దక్కించుకున్నారు. మిగిలిన 4 జట్లలో, 2 జట్ల నుంచి ఇద్దరు ఆటగాళ్లను రిజర్వ్ ప్లేయర్‌లుగా ఎంపిక చేయగా, మిగిలిన రెండు జట్ల నుంచి ఒక్క ఆటగాడు కూడా భారత ప్రపంచ కప్ జట్టులో ఎంపిక కాలేదు. జూన్‌లో జరగనున్న %ూ%20 ప్రపంచ కప్ 2024 కోసం అత్యధిక ఆటగాళ్లను ఎంపిక చేసిన %శ్రూ% జట్టు ముంబై ఇండియన్స్. ఈ భారీ టోర్నీకి ముంబై నుంచి ఇంత మంది ఆటగాళ్లు టీమ్ ఇండియాలో ఎంపిక కావడం ఇదే తొలిసారి కాదు. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్న రోహిత్ శర్మ భారత ప్రపంచకప్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. ప్రస్తుతం ముంబై జట్టు కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యా భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. వీరితో పాటు ప్రస్తుతం ఐపీఎల్‌లో ముంబై తరపున ఆడుతున్న సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా కూడా ప్రపంచకప్ జట్టులోకి ఎంపికయ్యారు. ముంబైతో పాటు, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ముగ్గురు ఆటగాళ్లు భారత జట్టులో ఎంపికయ్యారు. రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ భారత జట్టులో వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్‌గా ఎంపికయ్యాడు. యశస్వి జైస్వాల్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా, యుజ్వేంద్ర చాహల్ స్పిన్ విభాగంలో ఉన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి కెప్టెన్ రిషబ్ పంత్‌తో పాటు అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్ కూడా టీమ్ ఇండియాలోకి ఎంట్రీ ఇచ్చారు. చెన్నై సూపర్ కింగ్స్ నుంచి శివమ్ దూబే, రవీంద్ర జడేజా భారత జట్టులోకి ఎంపికయ్యారు. అయితే ఈ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

# టీ 20 ప్రపంచకప్ జట్టులో మార్పులు!



ప్రతిష్ఠాత్మక టీ 20 ప్రపంచ కప్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించారు. రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు అమెరికా ఫ్లైట్ ఎక్కనుంది. వీరితో పాటు నలుగురు ప్లేయర్లను రిజర్వ్ గా ఉంచారు. అయితే ఇదే తుది జట్టు కాదు. ఎందుకంటే మే 25 వరకు జట్టులో మార్పులు చేసుకునేందుకు అన్ని జట్లకు అవకాశం ఉంది. ప్రతిష్ఠాత్మక %ు%20 ప్రపంచ కప్ కోసం 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించారు. రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు అమెరికా ఫ్లైట్ ఎక్కనుంది. వీరితో పాటు నలుగురు ప్లేయర్లను రిజర్వ్ గా ఉంచారు. అయితే ఇదే తుది జట్టు కాదు. ఎందుకంటే మే 25 వరకు జట్టులో మార్పులు చేసుకునేందుకు అన్ని జట్లకు అవకాశం ఉంది. అంటే టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి వారం రోజుల ముందు జట్టులో మార్పు రావచ్చు. దీని తర్వాత, గాయం సమస్య లేదా ఇతర కారణాల వల్ల భర్తీ చేసే ఆటగాళ్లను ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే అలాంటి మార్పుకు ముందు ఐసీసీ టెక్నికల్ కమిటీ అనుమతి తీసుకోవాలి. ఈ కారణంగానే బీసీసీఐ సెలక్షన్ కమిటీ నలుగురు రిజర్వ్ ఆటగాళ్లను ఎంపిక చేసింది. అంటే ఐపీఎల్‌లో ఎవరైనా ఆటగాడు చాలా పేలవంగా రాణిస్తే జట్టు నుంచి తప్పుకుంటారు. గతంలో కూడా టీమ్ ఇండియా ఇలాంటి మార్పులు చేసింది. ఉదాహరణకు అక్షర్ పటేల్ 2021 టీ20 ప్రపంచకప్ జట్టుకు ఎంపికయ్యాడు. కానీ టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ఇంకా రోజులు మాత్రమే ఉన్న సమయంలో రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో ఉన్న శార్దూల్ ఠాకూర్‌కు అవకాశం కల్పించారు. అలాగే అక్షర్ పటేల్ రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. అందుకే టీ20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందే భారత జట్టులో మరికొన్ని మార్పులు జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఈసారి చివరి క్షణంలో ఎవరికి అవకాశం దక్కుతుందో వేచి చూడాలి. ముఖ్యంగా ప్రస్తుతం రిజర్వ్ కేటగిరలో ఉన్న టీమిండియా ప్రిన్స్ శుభ్ మన్ గిల్ అలాగే టీమిండియా నయా ఫినిషర్ రింకూసింగ్ లకు ఇది లక్కీ ఛాన్స్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే వీరికి మెయిన్ జట్టులో చోటు దక్కాల్సిందని చాలామంది భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతోన్న ఐపీఎల్ వీరు ఓ మోస్తరుగా రాణించినా మెయిన్ జట్టులో చోటు దక్కించుకోవచ్చు. అలాగే టీమిండియా సొగసరి బ్యాటర్ కేఎల్ రాహుల్ కు కూడా అన్యాయం జరిగిందని భావిస్తారు. కాబట్టి అతనికి కూడా ఇది మంచి అవకాశం.

టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు:
రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్, సంజు శాంసన్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్ , అర్ష్‌దీప్ సింగ్, మహమ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా.
రిజర్వ్‌లు: శుభమన్ గిల్, అవేష్ ఖాన్, రింకూ సింగ్, ఖలీల్ అహ్మద్.

# డై హార్డ్ ఫ్యాన్స్..
# అందుకే అరుస్తున్నారు: ప్యాట్ కమిన్స్




ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్ చేయడం తమకు కలిసొచ్చిందని, తమకు విజయాలు కూడా దక్కాయని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తెలిపాడు. దాంతోనే ఈ మ్యాచ్‌లోనూ ముందుగా బ్యాటింగ్ చేయాలనుకుంటున్నామని చెప్పాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకోగానే అభిమానుల నుంచి పెద్ద ఎత్తున అరుపులు వినిపించడంతో కమిన్స్ సంతోషం వ్యక్తం చేశాడు. గత రెండు మ్యాచ్‌ల్లో తాము ముందుగా బౌలింగ్ చేసి ఓటమిపాలయ్యామని, దాంతోనే తాజా నిర్ణయంతో ఫ్యాన్స్ అంతా ఉత్సాహానికి లోనవుతున్నారని కమిన్స్ తెలిపాడు. ముందుగా బ్యాటింగ్ చేయడం తమ అతిపెద్ద బలమని, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని చెప్పాడు. మరోవైపు టాస్ గెలిస్తే తాము కూడా బ్యాటింగ్ తీసుకునేవాళ్లమని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ తెలిపాడు. 'మేం కూడా ముందుగా బ్యాటింగ్ చేయాలనుకున్నాం. ఈ పిచ్ కండిషన్స్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. ఈ సీజన్‌లో మేం అద్భుత ప్రదర్శన కనబర్చాం. ఈ మూమెంటమ్‌ను కొనసాగించడం చాలా ముఖ్యం. చాలా విషయాలు మాకు అనుకూలంగానే ఉన్నాయి. మాకు వర్కౌట్ అయిన ప్రణాళికలకే కట్టుబడి ఉన్నాం.'అని సంజూ శాంసన్ చెప్పుకొచ్చాడు.

# 90 బిలియన్ డాలర్లకు ఎలక్ట్రానిక్స్ దిగుమతులు



**న్యూఢిల్లీ:** దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి మోదీ సర్కార్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. మేక్ ఇన్ ఇండియా అనే నినాదంతో దూసుకుపోయిన కేంద్ర సర్కార్‌కు దిగమతుల గణాంకాలు షాకిస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 89.8 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స, టెలికం, ఎలక్ట్రికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నది. వీటిలో సగం చైనా, హాంకాంగ్ దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం విశేషం. ఈ విషయాన్ని గ్లోబల్ ట్రేడ్ రీసర్చ్ ఇనిషియేటివ్(జీటీఆర్ఐ) వెల్లడించింది. గడిచిన ఏడాదిగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నప్పటికీ దిగుమతులు మాత్రం ఆగడం లేదు. అంతకంతకు పెరుగుతున్నాయి. ఈ రంగాలతో రోజుకు లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారని జీటీఆర్ఐ ఫౌండర్ అజయ్ శ్రీవాత్సవ తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు సంబంధించి భారత్ దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని, వీటిని తగ్గించుకోవాలంటే దేశీయ ఉత్పత్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు.

# జోరుగా ఐఈఎక్స్ ట్రేడింగ్


### గత నెల ఓవరాల్ వాల్యూమ్ 14% వృద్ధితో 9,044 మిలియన్ యూనిట్లకు

**న్యూఢిల్లీ:** దేశీయ పవర్ ట్రేడింగ్ ఎక్స్ఛేంజ్‌ల్లో ఒకటైన ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్)లో గత నెల ఓవరాల్ ట్రేడ్ వాల్యూమ్ నిరుడు ఏప్రిల్‌తో పోల్చితే 14.1 శాతం పెరిగింది. ఈ ఏప్రిల్‌లో 9,044 మిలియన్ యూనిట్లు (ఎంయూ)గా నమోదైంది. గత ఏడాది 7,928 మిలియన్ యూనిట్లే. ఈసారి డే ఎహెడ్ మార్కెట్ (డీఏఎం) వాల్యూమ్ 4,116 ఎంయూగా, రియల్-టైం ఎలక్ట్రిసిటీ మార్కెట్ (ఆర్‌టీఎం) వాల్యూమ్ 2,629 ఎంయూగా, టర్మ్-ఎహెడ్ మార్కెట్ (టీఏఎం) వాల్యూమ్ 1,276 ఎంయూగా, ఐఈఎక్స్ గ్రీన్ మార్కెట్ వాల్యూమ్ 402 ఎంయూగా ఉన్నాయి.

# రూ.4.26 లక్షల కోట్లు

**- ప్రభుత్వ సంస్థల్లో మోదీ సర్కారు పెట్టుబడుల ఉపసంహరణ - ప్రైవేట్‌పరమైన ఎయిర్ ఇండియా**
**- విలీనాల దిశగా ప్రభుత్వ రంగ బ్యాంకులు - ఆర్బీఐ స్వయం ప్రతిపత్తినీ దెబ్బతీసే చర్యలు**




గత పదేండ్లలో కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తీరు ఇలాగే ఉందన్న విమర్శలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి మరి. ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ సాగిన ఈ దశాబ్దకాల పాలనలో ఎయిర్ ఇండియా వంటి ప్రతిష్ఠాత్మక సర్కారీ కంపెనీలు కనుమరుగైపోయాయన్నది నిజం.దేశ బ్యాంకింగ్ వ్యవస్థనూ వదల్లేదు. ఒకప్పుడు 27 ప్రభుత్వ బ్యాంకులుంటే ఇప్పుడు 12కు పడిపోయాయి. చివరకు బ్యాంకింగ్ రంగ నియంత్రిత సంస్థగా ఉన్న ఆర్బీఐనీ వెంటాడి, డివిడెండ్ల పేరుతో బలహీనపర్చాలని చూడటం.. ప్రభుత్వ పెద్దలకు, ఆర్బీఐ గవర్నర్లకు మధ్య విబేధాల్ని తెచ్చిపెట్టింది.కుదిరితే ఒక్కసారిగా అమ్మేయడం.. కుదరకపోతే విడుతలవారీగా వాటాలను విక్రయించడం.. మొత్తానికి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ బాట పట్టించడమే లక్ష్యంగా గత పదేండ్ల మోదీ సర్కారు పాలన సాగింది. 2014-15 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ రూ.4.26 లక్షల కోట్లుగా ఉన్నది. 2017-18లో అత్యధికంగా లక్ష కోట్ల రూపాయలపైనే ఆదాయం వచ్చింది. నిజానికి బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యాలు నెరవేరితే.. పెట్టుబడుల ఉపసంహరణలు రూ.10 లక్షల కోట్లు దాటేవే.

**డివిడెండ్లతో..**

ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఏటా డివిడెండ్ల రూపంలో అందుకున్నదే ఈ పదేండ్లలో రూ.15 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే ఇందులో సగం వచ్చిందని గణాంకాలు చెప్తున్నాయి. 2018-19లో ఏకంగా రూ.1,76,051 కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ నుంచి కేంద్ర ప్రభుత్వం అందుకున్నది. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్‌తో కేంద్రం గొడవలు తారాస్థాయికి చేరిన సంగతీ విదితమే. ఆర్బీఐ నగదు నిల్వలపై మోదీ సర్కారు కన్నేయడంతోనే పటేల్ తన పదవీకాలం ముగియకుండానే వెళ్లారన్నది చాలామంది అభిప్రాయం. ఈ క్రమంలోనే ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ వచ్చారు.

# హరిహరవీరమల్లు టీజర్ విడుదల

## క్రిష్ స్థానంలో జ్యోతికృష్ణ డైరెక్షన్




పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు' తొలిసారి నటిస్తున్న పాన్ ఇండియా పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఈ చిత్రం మొదలైంది. మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై ఏఎమ్ రత్నం నిర్మాతగా ఈ చిత్రం ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. సినిమా ప్రారంభమై దాదాపు మూడేళ్లు కావొస్తున్నా... ఇంకా ఓ కొలిక్కి రాలేదు. కారణం పవన్ జనసేన పార్టీ పనుల్లో నిమగ్నం కావడం, ప్రచారంలో బిజీ కావడం. దర్శకుడు క్రిష్ మాత్రం మూడేళ్ల ఇదే ప్రాజెక్ట్ మీద ఉన్నారు. ఇంకా లేట్ అవుతున్న నేపథ్యంలో ఆ గ్యాప్‌లో క్రిష్ అనుష్కాశెట్టితో ఓ సినిమా మొదలుపెట్టారు. తాజాగా గురువారం 'ధర్మం కోసం యుద్ధం – 2024' అనే ట్యాగ్‌లైన్‌తో 'హరిహర వీరమల్లు' చిత్రం అప్‌డేట్ ఇస్తూ పవర్‌ఫుల్ టీజర్‌ను విడుదల చేశారు. తాజా పోస్టర్‌లో చిన్న మార్పు కనిపించింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి పక్కన మరో దర్శకుడి పేరు వచ్చి చేరింది. ఎ.ఎం రత్నం తనయుడు జ్యోతి కృష్ణ పేరు దర్శకత్వ విభాగంలో చేరింది. దీనిపై నిర్మాణ సంస్థ క్లారిటీ కూడా ఇచ్చింది. 'ఎనక్కు 20 ఉనక్కు 18', 'నీ మనసు నాకు తెలుసు', 'ఆక్సిజన్' వంటి చిత్రాలను తెరకెక్కించిన జ్యోతికృష్ణ పలు చిత్రాలకు రచయితగా కూడా పనిచేశారు. 'ఆ అనుభవంతో ఆయన 'హరిహర వీరమల్లు' చిత్రం మిగతా షూటింగ్‌ను, నిర్మాణానంతర కార్యక్రమాలను క్రిష్ పర్యవేక్షణలో పూర్తి చేస్తారని పేర్కొన్నారు. అంతే కాదు ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేస్తామని కూడా ప్రకటించారు. క్రిష్ మరో సినిమాతో బిజీగా ఉండటం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. క్రిష్ పర్యవేక్షణలో జ్యోతికృష్ణ మిగతా భాగాన్ని ఏ విధంగా తెరకెక్కిస్తాడనే చర్చ మొదలైంది ఇప్పుడు. నిధీ అగర్వాల్ కథానాయికగా, బాబీ దేవోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

# రాజమౌళి- మహేశ్‌బాబు కాంబినేషన్

## సినిమాను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం





నిర్మాత కె.ఎల్ నారాయణ రాజమౌళిదర్శకత్వంలో మహేష్‌బాబు హీరోగా 'ఎస్ఎస్ఎంబీ 29 చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'హలో బ్రదర్', 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'సంతోషం' వంటి హిట్ చిత్రాలను నిర్మించిన ఆయన సుదీర్ఘ విరామం తర్వాత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గతంలో ఓ సందర్భంలో మహేష్, రాజమౌళి కలయికలో భారీ బ్జడెట్ చిత్రం చేయబోతున్నాం అని వెల్లడించారు కానీ అంతకుమించి ఆ సినిమా గురించి ఎక్కడా నోరు మెదపలేదు. తాజాగా ఆయన ఓ వేదికపై రాజమౌళికి కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చిన మాట నిలబెట్టుకున్నారని నిర్మాత కె.ఎల్. నారాయణ అన్నారు. ఎస్ఎస్ఎంబీ 29 చిత్రాన్ని వాళ్లే స్వయంగా ప్రకటించి, పనిపై ఉన్న నిబద్ధతను చాటారని కొనియాడారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ఉద్దేశపూర్వకంగా నిర్మాతగా విరామం తీసుకోలేదన్నారు. రాజమౌళి–మహేశ్ బాబు కాంబినేషన్ సినిమాను 15 ఏళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. ఇప్పుడు వాళ్లిద్దరి క్రేజ్ మరో స్థాయిలో ఉంది. అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి నాకు సినిమా చేస్తున్నారు. నేను చెప్పకపోయినా 'దుర్గా ఆర్ట్స్ బ్యానర్'లో మూవీ తీయనున్నట్లు వాళ్లే ప్రకటించారు. అందుకు వాళ్లకి కృతజ్ఞుడిని. రాజమౌళికి హాలీవుడ్ నుంచీ ఆఫర్లు వచ్చాయి. వాటిని కాదనుకుని నా కోసం సినిమా చేస్తున్నారు. రెండు నెలల నుంచి ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. నిర్మాతలు కథా చర్చల్లో పాల్గొనరు అనే మాట ఇండస్ట్రీలో ఎక్కువ వినిపిస్తుంటుంది. అది అందరి విషయంలో నిజం కాదు. రాజమౌళి ప్రతి విషయాన్ని నిర్మాతలతో పంచుకుంటారు. పేపర్ వర్క్ చేస్తున్నప్పుడే క్లారిటీ ఉండడం మంచిదనే ఉద్దేశంతో ఏమైనా సందేహం ఉంటే చెప్పమని అడుగుతారు. చిన్న పాయింట్‌నీ కూడా ఆయన ఎంత క్షుణ్ణంగా పరిశీలిస్తారో దగ్గర ఉండి గమనించా. పాత్రకు తగ్గట్టు మహేశ్ తనని తాను మలుచు కుంటున్నారు. ఆగస్టు లేదా సెప్టెంబరులో చిత్రీకరణ ప్రారంభమవుతుంది. ఆస్కార్ విన్నింగ్ చిత్రం 'ఆర్ఆర్ఆర్' తర్వాత వస్తున్న చిత్రం కాబట్టి ఆ అంచనాలను దృష్టిలో పెట్టుకునే ప్రణాళిక చేసుకున్నాం. స్టోరీ బాగుంది. బ్జడెట్‌ని ఇంకా డిసైడ్ చేయలేదు. ప్రొడక్టుకు ఎంత అవసరమో అంత ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం అని అన్నారు.

# తలైవా జీవితం ఆధారంగా చిత్రం



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ బయోపిక్‌ను రూపొందించడానికి సన్నాహాలు చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. 'సాజిద్ కేవలం రజనీకాంత్ నటనకు మాత్రమే కాదు. ఆయన వ్యక్తిత్వానికి కూడా వీరాభిమానులుంటారు. ఆయన చేసే సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం. అయితే ఆయన గురించి పూర్తి విషయాలు ఎవరికీ తెలియదు. అందుకే ఆయన జీవితాన్ని తెరపై చూపించాలని సాజిద్ నిర్ణయించుకున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. బస్ కండక్టర్ నుంచి సూపర్ స్టార్ వరకూ ఆయన ఎలా ఎదిగారు, ఎక్కే ఒక్కో మెట్టులో ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు అన్నది సినిమాగా తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన ఈ కథపై చర్చలు చేస్తునట్లు, ఆయన కుటుంబంతో చర్చలు జరుపుతున్నారని' అని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్ పనులు కూడా మొదలయ్యాయట. గతేడాది 'జైలర్'తో భారీ విజయం అందుకున్నా తలైవా ఈ ఏడాది తన కూతురు దర్శకత్వంలో వచ్చిన లాల్ సలామ్ చిత్రంతో పరాజయాన్ని చవిచూశారు. ప్రస్తుతం ఆయన వేట్టయాన్' చిత్రంతో బిజీగా ఉన్నారు. టి.జె జ్ఞానవేల్ ఈ చిత్రానికి దర్శకుడు. తదుపరి లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'తలైవర్171' చిత్రం చేయనున్నారు.

అభిమాన హీరోను తెరపై చూస్తే ఫ్యాన్స్ ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ఇక వారు చేసే యాక్షన్ వెండితెరపై ఆవిష్కరించ చేస్తే ఆనందంలో మునిగి తేలుతుంటారు ప్రేక్షకులు. తాము అభిమానించే హీరో జీవితం తెరపైకి వస్తే సినీ ప్రియులకు పండగే. బాలీవుడ్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలతో దర్శకనిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్న సాజిద్ నదియావాలా అలాంటి ప్రయత్నంలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆయన తమిళ అగ్ర నటుడు

## టిల్లూ క్యూబ్‌లో పూజా హెగ్డే



అగ్ర కథానాయిక పూజాహెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. వరుస పరాజయాలతో ఈ భామ కెరీర్ సాగుతున్నది. ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చి కుటుంబ సభ్యులతో విరామ సమయాల్ని గడుపుతున్నది. తాజా సమాచారం ప్రకారం తెలుగు ఇండస్ట్రీ నుంచి ఈ అమ్మడు ఓ గుడ్‌న్యూస్‌ను అందుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాలు యువతరంలో మంచి ఆదరణ దక్కించుకున్నాయి. టిల్లు పాత్రలో హీరో సిద్ధు జొన్నలగడ్డ తనదైన మేనరిజమ్స్, హైదరాబాదీ కామెడీతో ఆకట్టుకున్నారు. ఈ రెండు చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఎంపిక చేసినట్లు తెలిసింది. డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ చిత్రాల్లో కథానాయిక పాత్రలకు చాలా ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడో భాగంలో పూజహెగ్డేను కథానాయికగా తీసుకోబోతున్నారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

# నేడు విడుదలవుతున్న ఆ ఒక్కటీ అడక్కు




అల్లరి నరేశ్ హీరోగా మల్లి అంకం తెరకెక్కించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు' ఫరియా అబ్దుల్లా కథానాయిక. వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మే 3న ప్రేక్షకుల ముందుకు ం ా న ం ది . ఈసందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడివి శేష్ అతిథిగా వ ా జ ర య్యా ర ు . 'డైరెక్టర్‌గా మల్లికి ఇది తొలి సినిమా. నేను ఇప్పటివరకు 32మంది దర్శకులతో వర్క్ చేశాను. వాళ్లందరూ రిలీజ్‌కు ముందు ఒత్తిడి గురయ్యేవారు. కానీ, మల్లి మాత్రం నవ్వుతూ ఉన్నారు. అలా ఉండడం చాలా గ్రేట్. నిర్మాత ఖర్చు విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. ఫరియా అబ్దుల్లాతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆమె ఉన్నత స్థానాలకు వెళ్లాలి. 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమా అందరినీ నవ్విస్తుంది. పెళ్లికాని వాళ్లు, సంబంధాలు వెతుకుతున్న వాళ్లు అందరూ ఈ చిత్రం చూడాలి. పెళ్లి పేరుతో జరుగుతోన్న మోసాలను ఇందులో చూపించాం. మీ అందరూ కూడా తెలుసుకోవాలి. మే3 థియేటర్‌కు వచ్చి సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అని అల్లరి నరేశ్ కోరారు. అడివి శేష్ మాట్లాడుతూ..'నరేశ్ నాకు మంచి ఫ్రెండ్. నా మొదటి సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయనే గెస్ట్‌గా వచ్చారు. నరేశ్ అంటే నాకు ఇంట్లో వాళ్లతో సమానం. ఫరియా అబ్దుల్లా మంచి అమ్మాయి. ఈ చిత్రబృందంలో చాలామంది నా కెరీర్ ప్రారంభంలో సపోర్ట్ చేశారు. అందుకే ఈ సినిమా నాకూ ప్రత్యేకమైనది. ఈ చిత్రం ప్రేక్షకాదరణ సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు.

# ఈ యేడు బడా సినిమాల సందడి

## లైన్‌లో కల్కి, పుష్ప, దేవర,గేమ్ ఛేంజర్‌లు




ఈ సంవత్సరం నాలుగు పెద్ద సినిమాలు విడుదల కానున్నాయి. అవి ఒక్క తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లో కూడా విడుదలవుతున్నాయి. ఈ నాలుగు సినిమాల్లో రెండు సినిమాలు విడుదల తేదీలు, ప్రచారాలు అప్పుడే మొదలు పెట్టేసారు. ఇంకో రెండు సినిమాలు ఇంకా చిత్రీకరణ దశలోనే వున్నాయి, కానీ ఆ రెండు సినిమాలు కూడా ఈ సంవత్సరమే విడుదలవుతున్నాయి. ఈ నాలుగు సినిమాలకి పెట్టిన బ్జడెట్ వీటిపై వచ్చే వ్యాపారాలు సుమారు రూ. రెండువేల కోట్లకి పైగా ఉంటుందని ట్రేడ్ విశ్లేషకుల అభిప్రాయం. ఇంతకీ ఈ నాలుగు సినిమాలు ఏవంటే, ముందుగా జూన్ 27 న విడుదలవుతున్న 'కల్కి 2898 ఏడి'. ఇందులో ప్రభాస్ కథానాయకుడు కాగా, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటాని, ఇంకా చాలామంది నటీనటులు వున్నారు. ఇది ఒక సైన్స్ ఫిక్షన్ కథ అని చెపుతున్నారు. నాగ్ అశ్విన్ దర్శకుడు కాగా, అశ్విని దత్ నిర్మాత. ఈ సినిమాకి సుమారు రూ. 600 కోట్లు బడ్జెట్ అయిందని వార్తలు వస్తున్నాయి. ఇక రెండో సినిమా 'పుష్ప 2: ది రూల్'. ఇది ఆగస్టు 15న విడుదలవుతోంది. అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ సినిమాకి సుకుమార్ దర్శకుడు. ఇది 'పుష్ప: ది రైజ్' అనే సినిమాకి సీక్వెల్ గా అంటే రెండో భాగంగా వస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలు వున్నాయి. ఈ సినిమా ఓటిటి హక్కులు నెట్ ఫ్లిక్స్ ఇప్పటికే రూ.275 కోట్లకి తీసుకుందని వార్తలు వచ్చాయి. అలాగే ఈ సినిమా హిందీ హక్కులు అనిల్ తడాని రూ. 200 కోట్లకు తీసుకున్నారని ఇంకో వార్త కూడా వచ్చింది. ఈ సినిమా మొదటి భాగం హిందీలో సుమారు రూ.125 కోట్ల వ్యాపారం చేసింది కాబట్టి, ఇప్పుడు రెండో భాగం అంతకన్నా ఎక్కువ చేస్తుందని నమ్ముతున్నారు. మూడో సినిమా జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర' సినిమా. బాలీవుడ్ నటి, శ్రీదేవి బోనీ కపూర్ ల కుమార్తె జాన్వీ కపూర్ ఇందులో కథానాయిక. కొరటాల శివ దర్శకుడు. ఈ సినిమా రెండు భాగాలుగా వస్తోంది, ఇందులో మొదటి భాగం ముందుగా అనుకున్న తేదీ ప్రకారం అయితే ఈపాటికి విడుదలైపోవాలి, కానీ కొన్ని అనివార్య కారణాల వలన ఈ సినిమా విడుదల దసరా పండగ సందర్భంగా అక్టోబర్ 10 కి వాయిదా వేశారు. ఆర్ఆర్ఆర్' సినిమా తరువాత ఎన్టీఆర్ చేస్తున్న పాన్ ఇండియా సినిమా ఇదే. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఇందులో ప్రతినాయకుడి పాత్ర పోహిస్తున్నారు. ఈ సినిమా విడుదలకి ఇంకా చాలా సమయం వున్నా, ఇది ఎన్టీఆర్ కి ఒక ప్రతిష్టాత్మక చిత్రంగా వుండబోతోంది. తెలుగులో కాకుండా పాన్ ఇండియా లెవెల్లో అతని స్టామినా ఏంటో ఈ సినిమా ద్వారా నిరూపితం అవుతుంది కాబట్టి, ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇక నాలుగో సినిమా రామ్ చరణ్, దర్శకుడు శంకర్ ల కలయికలో వస్తున్న 'గేమ్ చేంజర్'.

ఈ సినిమా విడుదల తేదీ ఇంకా ప్రకటించలేదు, కానీ ఈ సంవత్సరమే విడుదలవుతుందని మాత్రం అంటున్నారు.

**Owner, Editor, Printed & Published :** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, RNI NO : TELTEL/2023/86487 Cell: 8125972476. website : quicktodaynews.com .com, e-mail : quicktodaynews@gmail.com